teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 119 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 24 ఆగస్టు 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


## యాదగిరిగుట్ట దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

### ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహించనున్నట్లు ఈవో ప్రకటన



యాదాద్రి భువనగిరి, ఆగష్టు 23 (తీన్మార్ న్యూస్): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 27 నుంచి 29 వరకు శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఈవో భాస్కర్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీవైష్ణవ పాంచరాత్ర ఆగమశాస్త్ర పద్ధతుల్లో మూడు రోజులపాటు వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 29న సాయంత్రం 5 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉట్లు కొట్టే కార్యక్రమం, రాత్రి 8 గంటలకు రుక్మిణీ కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా ఆర్జిత సేవలైన నిత్య, శాశ్వత, మొక్కు కల్యాణాలు, బ్రహ్మోత్సవాలు, సుదర్శన నారసింహ హోమం, భోగాలు 27 నుంచి 29 వరకు మూడు రోజులపాటు తాత్కాలికంగా రద్దు చేయనున్నట్లు ఈవో తెలిపారు.



## జనవరి నుంచి రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం

### పంపిణీ చేయాలని కాంగ్రెస్ సర్కార్ నిర్ణయం

### చర్యలు, సవాళ్లపై అధికారులతో చర్చించిన మంత్రి ఉత్తమ్

తెలంగాణ బ్యూరో, ఆగష్టు 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో తెల్లరేషన్ కార్డు ఉన్న పేదలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. వచ్చే ఏడాది జనవరి నుంచి రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేయాలని కాంగ్రెస్ సర్కార్ నిర్ణయించింది. అందుకోసం తీసుకోవాల్సిన చర్యలు, ఎదు-రయ్యే సవాళ్లపై అధికారులతో చర్చించారు మంత్రి ఉత్తమ్. రేషన్ దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేసే పిడియస్ బియ్యం దారి తప్పితే కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీలర్లు పట్టుబడితే డీలర్ షిప్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వానికి మచ్చ తెస్తే ఉపేక్షించేది లేదన్నారు. రేషన్ డీలర్ల ఆదాయం పెంపునకు ప్రణాళికలు రచించాలని, ప్రభుత్వ వసతి గృహాలతో పాటు అంగన్ వాడి, మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు మంత్రి ఉత్తమ్.



## తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు

### వివిధ ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేసే ప్రయత్నం

స్పీడ్ పేరుతో కొత్తగా కార్యాచరణకు శ్రీకారం.. నేరుగా సిఎం రేవంత్ సమీక్షించేలా ప్రణాళిక

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాలనలో మరో కీలక అడుగు వేసింది. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు ప్రత్యేక మిషన్ చేపట్టింది. స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ(స్పీడ్) పేరుతో కొత్త కార్యాచరణ రూపొందించింది. తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 19ప్రాజెక్టులు, పనులను స్పీడ్ పరిధిలోకి తెచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీటిని స్వయంగా పర్యవేక్షిస్తారు.**



తీన్మార్ న్యూస్ వెబ్ డెస్క్, ఆగష్టు 23 (తీన్మార్ న్యూస్): పనులతీరు, పురోగతిపై సంబంధిత విభాగాల అధికారులతో నెలకోసారి సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. ఈ పనులన్నింటినీ నిర్ణీత వ్యవధిలో సమర్థవంతంగా పూర్తి చేయాలనేది స్పీడ్ ప్రధాన లక్ష్యం. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రామాణికమైన

మిగతా 2 లో



## ఖరారుకానున్న టి కాంగ్రెస్ కొత్త సారథి

### కొత్త పీసీసీ అధ్యక్షుడిగా పరిశీలనలో ముగ్గురి పేర్లు

### ఢిల్లీ నిర్ణయాల వైపు ఉత్కంఠగా ఆశావాహుల చూపులు

తెలంగాణ కాంగ్రెస్ కు కొత్త సారథి ఖరారు కానున్నారు. సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. కాంగ్రెస్ కోర్ కమిటీ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. కొత్త పీసీసీ అధ్యక్షుడిగా ముగ్గురి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. అధ్యక్షుడి ఎంపికతో పాటు కేబినెట్ విస్తరణపై కూడా హైకమాండ్ వద్ద చర్చ జరిగే అవకాశం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కొత్త నిర్ణయాలు ఉండనున్నాయి. దీంతో, కాంగ్రెస్ ఆశావాహులు ఢిల్లీ నిర్ణయాల వైపు ఉత్కంఠగా చూస్తున్నారు.



తెలంగాణ బ్యూరో, ఆగష్టు 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణ కాంగ్రెస్ కొత్త అధ్యక్షుడి ఎంపిక తుది కసరత్తు కొనసాగుతోంది. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్, డిప్యూటీ

మిగతా 2 లో



## గద్దర్ అవార్డుల విధి విధానాలకు సినీ ప్రముఖులతో కమిటి

ఈ మేరకు సర్కార్ ఉత్తర్వులు జారీ

కమిటీతో చర్చ అనంతరం కార్యాచరణకు ఆదేశాలు

.. వివరాలు 2లో

## నా ఇల్లు అక్రమంగా ఉంటే కూల్చివేయండి

### హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని కోరిన మంత్రి పొంగులేటి

### బఫర్ జోన్‌లో ఉందని నిరూపించాలని కేటీఆర్, హరీశ్ రావులకు ఛాలెంజ్



హైదరాబాద్, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): హిమాయత్ సాగర్ బఫర్ జోన్‌లో తన ఇల్లు ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించడంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ మండిపడ్డారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ తన ఇల్లు ఇంచు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నా టేప్ పెట్టి కొలిచి కూలగొట్టాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని

మిగతా 2 లో

## డాక్టర్‌పై అత్యాచారం కేసు సీబీఐ విచారణలో సంచలన విషయాలు

డోర్ పనిచేయని విషయం అందరికీ తెలిసిందే

డోర్ లాక్ చేసుకునే వీలుంటే ఈ ఘాతుకం జరిగేదే కాదు

సీబీఐ విచారణలో డాక్టర్ల నుండి సమాచారం



తీన్మార్ న్యూస్ వెబ్ డెస్క్, ఆగష్టు 23 (తీన్మార్ న్యూస్): ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌లో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య కేసులో సీబీఐ విచారణ వేగం పెరగడంతో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. నేరం జరిగినట్టు భావిస్తున్న ఆసుపత్రి సెమినార్ హాలు డోర్ బోల్ట్ విరిగిపోవడం తాజాగా సీబీఐ దృష్టికి వచ్చింది. విచారణలో భాగంగా జూనియర్ డాక్టర్ సిబ్బంది సెమినార్ హాలులో గొళ్లెం పనిచేయక పోవడం

మిగతా 2 లో



## నేతల భవనాలను కూల్చిన తర్వాతే సామాన్యులవి

### కాంగ్రెస్ ప్రభుత్వానికి కేటీఆర్ సూచనలు

హైదరాబాద్, ఆగష్టు 23 (తీన్మార్ న్యూస్): ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో అక్రమంగా ఉన్న భవనాలన్నీ కూల్చాల్సిందే నేతల భవనాలను కూల్చిన తర్వాత సామాన్యులవి కూల్చాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ పార్టీ శ్రేణుల దాడులు, పోలీసు నిర్లక్ష్య వైఖరిపై రాష్ట్ర డీజీపీని కేటీఆర్, సీనియర్ నాయకులు కలిసి ఫిర్యాదు

మిగతా 2 లో

## మంకీపాక్స్ వ్యాధిపై తెలంగాణ సర్కార్ అప్రమత్తం

### రాష్ట్రంలోకి వ్యాధి ప్రవేశించకుండా పలు చర్యలు.. మంకీపాక్స్ కోసం ప్రత్యేకంగా ఐసోలేషన్ వార్డును సిద్ధం




హైదరాబాద్, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): విదేశాల్లో డేంజర్ బెల్స్ మోగిస్తున్న మంకీపాక్స్ వ్యాధిపై తెలంగాణ సర్కార్ అప్రమత్తమైంది. రాష్ట్రంలోకి వ్యాధి ప్రవేశించకుండా పలు చర్యలు తీసుకుంది. ఎయిర్ పోర్ట్‌ల్లో ప్రయాణికులను చెక్ చేసి ఆరోగ్య సమస్యలుంటే వారిని ప్రత్యేకంగా ఉంచుతోంది. మంకీపాక్స్ వ్యాప్తిపై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఇప్పటికే అధికారులతో సమీక్ష

మిగతా 2 లో

## ఈనెల 25న మెట్రోస్టేషన్ వద్ద ప్రయాణికుల మహాధర్న

### ఫ్రీ పార్కింగ్ పునరుద్ధరించాలంటూ డిమాండ్



హైదరాబాద్, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): నగర మెట్రోస్టేషన్ల వద్ద ఫ్రీ పార్కింగ్ సదుపాయం పునరుద్ధరించాలంటూ ఈనెల 25న నాగోల్ మెట్రోస్టేషన్ వద్ద ప్రయాణికులు మహాధర్నాకు దిగనున్నారు. ఇటీవల నాగోల్, మియాపూర్ మెట్రోస్టేషన్ల వద్ద ఉచిత పార్కింగ్

మిగతా 2 లో




## ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందులు కరువు

### రేవంత్ రెడ్డికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు లేఖ

### మూగజీవాల సంరక్షణపై ప్రభుత్వ నిర్లక్ష్యం శోచనీయం

హైదరాబాద్, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు లేఖ రాశారు. వ్యవసాయంలో దన్నుగా నిలుస్తూ, పాడిసంపదతో అదనపు ఆదాయాన్ని సమకూర్చే మూగజీవాల సంరక్షణపై కాంగ్రెస్ ప్రభుత్వం

మిగతా 2 లో

## 19 ప్రాజెక్టులు, పనులను స్పీడ్ పరిధిలోకి తెచ్చిన సర్కార్

### స్వయంగా పర్యవేక్షించనున్న సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ బ్యూరో, ఆగష్టు 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాలనలో మరో కీలక అడుగు వేసింది. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు ప్రత్యేక మిషన్ చేపట్టింది. స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియంట్

## జీహెచ్ఎంసీ పరిధిలో 21 మంది కమిషనర్ల ట్రాన్స్‌ఫర్

### ఉత్తర్వులు జారీ చేసిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి



హైదరాబాద్, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) లో పెద్ద ఎత్తున అధికారుల బదిలీలు జరిగాయి. ఒకేసారి 21 మంది కమిషనర్లను ప్రభుత్వం ట్రాన్స్‌ఫర్ చేసింది. బదిలీలతో పాటు కొత్తవారికి పోస్టింగులు ఇచ్చారు. లాంగ్ స్టాండింగ్ అధికారులకు సైతం ప్రభుత్వం స్థానచలనం కల్పించింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శానిటేషన్, ట్రాన్స్‌పోర్టేషన్ అడిషనల్ కమిషనర్‌గా రఘు ప్రసాద్ ఎస్టేట్స్ అడిషనల్ కమిషనర్‌గా అశోక్ సామ్రాట్ రెవెన్యూ, ఐటి అడిషనల్ కమిషనర్‌గా

మిగతా 2 లో

# గద్దర్ అవార్డుల విధి విధానాలకు సినీ ప్రముఖులతో కమిటి

హైదరాబాద్, ఆగష్టు 23 (తీన్మార్ న్యూస్): గద్దర్ పేరుతో అవార్డులు ఇస్తామని ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం కార్యాచరణను మొదలుపెట్టింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి గద్దర్ అవార్డుల విధి విధానాలు, నియమ నిబంధనలు, లోగోను రూపొందించేందుకు సినీ ప్రముఖులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. గద్దర్ అవార్డుల కమిటీకి ఛైర్మన్‌గా బి.నర్సింగరావు, వైస్ ఛైర్మన్‌గా నిర్మాత దిల్ రాజును నియమించింది. అలాగే కమిటీ సలహాదారులుగా రాఘవేంద్రరావు, అందెశ్రీ, తమ్మారెడ్డి భరద్వాజ, అల్లు అరవింద్, గుమ్మడి వెన్నెల, తనికెళ్ల భరిణి, దగ్గుబాటి సురేష్ బాబు, చంద్రబోస్, ఆర్.నారాయణమూర్తి, వందేమాతరం శ్రీనివాస్, అల్లాణి శ్రీధర్, సానా యాదిరెడ్డి, హరీశ్ శంకర్, బలగం వేణుతో పాటు ఎఫ్‌డీసీఎండీ మెంబర్ కన్వీనర్‌గా కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఎఫ్‌డీసీ ఈ కమిటీతో చర్చించి తదుపరి కార్యాచరణ మొదలుపెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. గద్దర్ పేరిట అవార్డులు ఇస్తామని ప్రకటించినా టాలీవుడ్ నుంచి తమను ఎవరూ సంప్రదించలేదని సీఎం రేవంత్‌రెడ్డి కామెంట్స్‌తో తెలుగు ఫిల్మ్ ఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ రంగంలోకి దిగాయి. గద్దర్ అవార్డులపై తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో చర్చించి, విధి విధానాలను రూపొందించి ప్రభుత్వానికి అందజేశాయి. ఆ నివేదికల ఆధారంగా ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌తో పాటు, కమిటీ సభ్యులను ఎంపిక చేసి తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

# ఖరారుకానున్న టి కాంగ్రెస్ కొత్త సారధి

**మొదటి పేజీ తరువాయి**

సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో నేడు ఏఐసీసీ నేతలతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఈ ముగ్గురి అభిప్రాయాలను తెలుసుకున్న తర్వాత తుది నిర్ణయం ప్రకటించనున్నారు. టీపీసీసీ నూతన అధ్యక్షుడి నియామకంలో సామాజిక సమీకరణాలు కీలకంగా మారుతున్నాయి. పార్టీకి ఇప్పటికే తన అభిప్రాయం స్పష్టం చేసానని టీపీసీసీ చీఫ్ గా ఎవరిని నియిమించినా తనకు అభ్యంతరం లేదని రేవంత్ స్పష్టం చేసారు.

**రేసులో నలుగురు**

పీసీసీ చీఫ్ గా నలుగురి పేర్లు తుది పరిశీలనతో ఉన్నాయి. బీసీ సామాజిక వర్గం నుంచి మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, ఎస్సీ వర్గం నుంచి విప్ అడ్లూరి లక్ష్మణ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్కుమార్, ఎస్టీ వర్గం నుంచి ఎంపీ బలరాం నాయక్ పేర్లు ఉన్నట్టు తెలిసింది. అయితే ఇందులో ఎవరిని నియమిస్తే పార్టీకి ఉపయోగం ఉంటుందనే కోణంలో పార్టీ అధిష్టానం ఆలోచన చేస్తోంది. పీసీసీ పదవి ఒక సామాజిక వర్గానికి ఇస్తే, త్వరలో జరగనున్న కేబినెట్ విస్తరణలో ఆ వర్గానికి మంత్రి పదవి ఉండదని హైకమాండ్ స్పష్టం చేసినట్టు తెలిసింది.

**హైకమాండ్ నిర్ణయం**

ఈ నిర్ణయంతో పాటుగా మంత్రివర్గ విస్తరణ పైన నిర్ణయం తీసుకొనే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం సీఎంతో కలుపుకుని మొత్తం 12 మంది మంత్రులు ఉండగా, మరో ఆరుగురికి కేబినెట్ లో చోటు ఉంది. అయితే ప్రస్తుతం సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని ముగ్గురు లేదా నలుగురిని కేబినెట్ లోకి తీసుకునే చాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. విస్తరణ జరిగితే ఇద్దరు రెడ్లు, ఒక ఎస్సీ, ఒక మైనార్టీకు చాన్స్ ఇవ్వాలని రేవంత్ భావిస్తున్నారు. అదే విధంగా పెండింగ్ నామినేటెడ్ పదవులను ఖరారు చేసే అవకాశం కనిపిస్తోంది.

# నా ఇల్లు అక్రమంగా ఉంటే కూల్చివేయండి

**మొదటి పేజీ తరువాయి**

కోరారు. దమ్ముంటే కేటీఆర్, హరీశ్ రావు తన ఇల్లు బఫర్ జోన్‌లో ఉందని నిరూపించాలని ఛాలెంజ్ విసిరారు. నా ఇల్లు హిమాయత్ సాగర్ బఫర్ జోన్‌లో ఉందని కేటీఆర్ తొత్తులు అంటున్నారు. బీఆర్ఎస్‌తోపాటు ఆ పార్టీ మాజీ నేతలు నాపై బురద జల్లాలని చూస్తున్నారు. సామాన్యులకు ఇబ్బందులు ఎదురుకావొద్దని సీఎం రేవంత్ హైడ్రా ఏర్పాటు చేశారు. బఫర్ జోన్, ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను బీఆర్ఎస్ సర్కార్ పట్టించుకోలేదు. హైడ్రా ద్వారా ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలనేదే మా ఉద్దేశం. ప్రభుత్వ చర్యలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రాను మంచి ఉద్దేశంతోనే తెచ్చాం. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోని నిర్మాణాలకు అనుమతించట్లేదు. నిబంధనలు అతిక్రమించిన కట్టడాలనే కూల్చివేస్తున్నాం. అవన్నీ బీఆర్ఎస్ హయాంలో జరిగిన నిర్మాణాలు. నా ఇల్లు అక్రమంగా ఉంటే వెంటనే కూల్చివేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ఆదేశిస్తున్నా. అధికారులకు బదులు బీఆర్ఎస్ నేతలే వెళ్లి కొలతలు తీయండి. అక్రమ కట్టడం అని తేలితే.. కూల్చేయండి" అని పొంగులేటి.. కేటీఆర్‌కు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ నిరసనలను కవర్ చేస్తున్న ఓ మీడియా మహిళ జర్నలిస్టులపై దాడి జరగడం దురదృష్టకరమని పొంగులేటి పేర్కొన్నారు. "సీఎం రేవంత్ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఘటనపై విచారణకు ఆదేశించాం. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తాం" అని పొంగులేటి తెలిపారు.

# ఈనెల 25న మెట్రోస్టేషన్ వద్ద ప్రయాణికుల మహాధర్నా

**మొదటి పేజీ తరువాయి**

సదుపాయం ఎత్తివేస్తూ ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో నిర్ణయం తీసుకుంది. దీనిపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల నుంచి అడ్డగోలుగా దోపిడి చేస్తున్నారంటూ ఆందోళనకు పిలుపునిచ్చారు. ఇటీవల హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు యాజమాన్యం ఎల్ అండ్ టీ భారీ షాక్ ఇచ్చింది. ఆగస్టు 14న ఉదయం నాగోల్ స్టేషన్ వద్దకు వెళ్లిన ప్రయాణికులు అవాక్కయ్యారు. అప్పటివరకూ ఉన్న ఉచిత పార్కింగ్ సదుపాయాన్ని తొలగిస్తూ ప్రీపెయిడ్ పార్కింగ్ బోర్డు దర్శనమిచ్చింది. దీన్ని చూసిన వారంతా నోరెళ్లబెట్టారు. ద్విచక్రవాహనాన్ని 2గంటలు పార్కింగ్ చేస్తే రూ.10, అలాగే 8గంటలపాటు చేస్తే రూ.25, అదే 12గంటలపాటు పార్క్ చేయాల్సి వస్తే రూ.40కట్టాలంటూ యాజమాన్యం పేర్కొంది. కారును రెండు గంటలపాటు పార్క్ చేస్తే రూ.30, 8గంటలకు అయితే రూ.75, అదే 12గంటలపాటు పార్క్ చేస్తే రూ.120 చెల్లించాలంటూ ప్రీపెయిడ్ పార్కింగ్ బోర్డు కనిపించింది. అదనంగా ఒక్కో గంటకు మరో రూ.5చొప్పున చెల్లించాలంటూ తెలిపింది. పార్కింగ్ కోసం 40శాతం డిస్కౌంట్‌తో నెలవారీ పాసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. దీనిపై ఒక్కసారిగా ఆగ్రహానికి గురైన ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ఎప్పుడూ లేనిది పార్కింగ్ కోసం నగదు వసూలు చేయడం ఏంటని మండిపడ్డారు. నాగోల్ మెట్రో స్టేషన్ లోపలికి వెళ్లి అధికారులను నిలదీశారు. ఎప్పటిలాగే ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్, మాదాపూర్ ప్రాంతాల్లో పని చేసే తాము అక్కడ అద్దెలు కట్టలేక నాగోల్, ఎల్బీ నగర్ ప్రాంతాల్లో ఉంటున్నామని, ఛార్జీలు కాకుండా పార్కింగ్ ఫీజు చెల్లించాలంటూ మెట్రో కొత్త రూల్స్ తీసుకురావడం దారుణమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఛార్జీలు, పార్కింగ్ ఫీజుల కోసం నెలకు వేల రూపాయలు సర్పించుకోవాల్సి వస్తుందంటూ మొరపెట్టుకున్నారు. ఈ మేరకు పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. గత శనివారం రోజునా సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బేగంపేటలోని మెట్రో రైలు భవన్ ఎదుట ధర్నాకు దిగారు. అయినా యాజమాన్యం వెనక్కి తగ్గలేదు. దీంతో తాజాగా మెట్రో ప్రయాణికులు ఈనెల 25న మహాధర్నాకు పిలుపునిచ్చారు. దీనిపై ఎల్ అండ్ టీ మెట్రో ఎలా స్పందిస్తుందో చూడాలి మరి.

# మంకీపాక్స్ వ్యాధిపై తెలంగాణ సర్కార్ అప్రమత్తం

**మొదటి పేజీ తరువాయి**

నిర్వహించారు. అనుమానితులను ఎప్పటికప్పుడు కనిపెడుతూ ఉండటానికి గాంధీ, నల్లకుంట ఫీవర్ ఆస్పత్రులను సిద్ధం చేశారు. ఎంపాక్స్ అనుమానితులను, వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్స అందించేందుకు అక్కడే ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారు. గాంధీ ఆసుపత్రిలో ఎంపాక్స్ చికిత్స కోసం ప్రస్తుతం 20 పడకలు కేటాయించారు. ఇందులో పురుషులకు, మహిళలకు పదేసి పడకలు కేటాయించినట్లు వైద్యులు తెలిపారు. ఫీవర్ ఆస్పత్రిలో ఆరు పడకలు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు రాష్ట్రంలో కేసులు నమోదు కాలేదని, కానీ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎంపాక్స్ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుల వద్దకు వెళ్లాలని చెప్పారు. మంకీ పాక్స్ ప్రస్తుతం పాకిస్థాన్ సహా ఆఫ్రికాలోని పలు దేశాల్లో విజృంభిస్తోంది. కాంగో, నైజీరియా, కామెరూన్ దేశాల్లో కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. ఆయా దేశాల నుంచి తెలంగాణకు వచ్చే వారిపై అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. అనుమానితులు ఐసోలేషన్‌లో ఉండటం, లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రిలో చేరాలని వైద్యులు సూచిస్తున్నారు. మంకీపాక్స్ కోసం ప్రత్యేకంగా ఐసోలేషన్ వార్డును సిద్ధం చేసినట్లు గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్ కుమారి తెలిపారు. మంకీ పాక్స్ బాధితుల చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రిలో అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

**మంకీపాక్స్ లక్షణాలు:**

జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, శరీరంలోని వివిధ అవయవాలపై దద్దుర్లు, దురద, వెన్నునొప్పి, చలి, తీవ్ర అలసట. ఈ లక్షణాలు ఉన్న వారు వెంటనే వైద్యులను సంప్రదించడం ముఖ్యం.

# తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు

**మొదటి పేజీ తరువాయి**



మౌలిక సదుపాయాల కల్పనలో వివిధ విభాగాల మధ్య ఉన్న అడ్డంకులు, అవరోధాలు అధిగమించేందుకు స్పీడ్ ప్రత్యేక చొరవ తీసుకోనుంది. స్పీడ్ కింద చేర్చిన పనుల పురోగతిపై సీఎం రేవంత్ రెడ్డి నెలకోసారి సమీక్ష నిర్వహిస్తారు. దీని వల్ల ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా నేరుగా ముఖ్యమంత్రి స్థాయిలో అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు వీలుంటుంది. పట్టణాలు సహా అన్ని ప్రాంతాల్లోని అభివృద్ధి పనులపై స్పీడ్ దృష్టి కేంద్రీకరిస్తుంది. స్పీడ్ ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించేందుకు ఆయా విభాగాలు ప్రత్యేక విధానం అనుసరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. క్రమం తప్పకుండా పనితీరు సమీక్షించుకుని పర్యవేక్షణకు ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. కార్యక్రమంలో భాగంగా తమ పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టులు, పనులపై సంబంధిత విభాగాలు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేస్తాయి. స్పీడ్ ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా ప్రణాళిక విభాగం ఆన్‌లైన్ పోర్టల్ రూపొందిస్తుంది. ఏ రోజుకు ఎంత పని జరిగిందనే అప్ డేట్ డేటాను అందులో పొందుపరచాలి. ఏ గడువులోగా ఎంత పని జరుగు తుందనే నిర్ణీత కాల వ్యవధిని ఆయా విభాగాలు ఆన్ లైన్ పోర్టల్లో అప్డేట్ చేయాలి. ఎప్పటివరకు ఏయే పనులు పూర్తవుతాయనే అంచనాలను సైతం పోర్టల్‌లో ఉంచాలి. స్పీడ్ ప్రోగ్రామ్‌లోని 19 ప్రాజెక్టులు వివరాలు ఇలావున్నాయి. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్,శాటిలైట్ టౌన్ల అభివృద్ధి, మెట్రో రైలు విస్తరణ, జీహెచ్ఎంసీ పునర్ వ్యవస్థీకరణ, రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ సిటీలో ఎలివేటెడ్ కారిడార్లు రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాలు,ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణం, మహిళా శక్తి పథకం అమలు జిల్లా సమాఖ్య భవనాల నిర్మాణం,రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌లు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల సంస్థాగత అభివృద్ధి, ఐటీఐలలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, కొత్త ఉస్మానియా హాస్పిటల్ నిర్మాణం, 15 కొత్త నర్సింగ్, 28 కొత్త పారా మెడికల్ కాలేజీలు ఏర్పాటు, హెల్త్ టూరిజం ప్రమోషన్, ఎకో టూరిజం ప్రాజెక్టుల ప్రమోషన్, టెంపుల్ సర్క్యూట్స్ టూరిజం, యాంటీ డ్రగ్స్ స్ట్రాటజీ అమలు వంటివి ఉన్నాయి. వీటిపై నిరంతరం సమీక్ష చేస్తూ పనులను పరిగెత్తించేందుకు చర్యలు తీసుకుంటారు. సిఎం నేరుగా స్పీడ్ పరిధిలోని పనులను సమీక్షించడం ద్వారా త్వరగా ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తారు.

# డాక్టర్‌పై అత్యాచారం కేసు సీబీఐ విచారణలో సంచలన విషయాలు




**మొదటి పేజీ తరువాయి**

గురించి బయటపెట్టారు. దీంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ట్రైనీ డాక్టర్ మృతదేహం కనిపించిన ఆగస్టు 9వ తేదీన ఆమె 36 గంటల సుదీర్ఘ విధుల అనంతరం ఉదయం 4 గంటల సమయంలో ఆసుపత్రి సెమినార్ హాలులో నిద్రపోయింది. అక్కడే ఆమెపై సివిక్ వాలంటీర్, నిందితుడు సంజయ్ రాయ్ అత్యాచారం చేసి, హత్య చేసినట్టు అనుమానిస్తున్నారు. అయితే, సెమినార్ హాలులో బాధితురాలిని చిత్ర హింసలు పెడుతున్న సమయంలో హాలు లోపల నుచి శబ్దాలు ఎవ్వరికీ వినిపించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని సీబీఐ చెబుతోంది. హాలు బయట నిల్చొని ఎవరైనా సహకరించారా అనే కోణంలోంచి కూడా దర్యాప్తు సంస్థ విచారణ జరుపుతోంది. ఇందుకోసం అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తోంది. ఆగస్టు 9వ తేదీ తెల్లవారుజామున 2 నుంచి 3 గంటల ప్రాంతంలో సెమినార్ హాలులోకి అడుగుపెట్టి, అక్కడ పడుకోవడం చూసినట్టు డ్యూటీ వైద్యుడు ఒకరు విచారణలో బయటపెట్టినట్టు సీబీఐ వెల్లడించింది. డోర్ పనిచేయని విషయం అందరికీ తెలిసిన విషయమేనని, బాధితురాలు ఆ రోజు డోర్ లాక్ చేసుకునేందుకు వీలుంటే ఈ ఘాతుకం జరిగి ఉండేది కాదని పలువురు డాక్టర్లు, ఇంటర్నెలు, జూనియర్ డాక్టర్లు సీబీఐ విచారణలో వెల్లడించారు. కాగా, కేసు విచారణలో భాగంగా ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రికి చెందిన నలుగురు ఉద్యోగులపై పాలీగ్రాఫ్ పరీక్షలను సీబీఐ నిర్వహించనుంది. వీరిలో ముగ్గురు జూనియర్ డాక్టర్లు కూడా ఉన్నారు. ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య కేసులో వీరి ప్రమేయం ఉందా అని ఈ లీగ్రాఫ్ పరీక్షల ద్వారా ఒక అవగాహనకు సీబీఐ రానుంది. ఘటన జరిగిన రెండ్రోజులకు రాజీనామా చేసిన ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌పై లై-డిటెక్టర్ పరీక్షలు జరిపేందుకు కూడా సీబీఐ అనుమతి తీసుకుంది. హత్యాచారం కేసులో ఎఫ్ఐఆర్ నమోదుకు 14 గంటల జాప్యం కావడంపై సందీప్ ఘోష్, బెంగాల్ పోలీసులను సుప్రీంకోర్టు ఇప్పటికే చీవాట్లు పెట్టింది. హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం ఘోష్ చేశారని కూడా అత్యున్నత న్యాయస్థానం తప్పుపట్టింది.

# ప్రభుత్వ పశు వైద్యశాలల్లో మందులు కరువు

**మొదటి పేజీ తరువాయి**

నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం శోచనీయమని హరీష్‌రావు మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో హరీష్‌రావు మీడియాతో మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ కూడా సీఎం వద్దే ఉన్నప్పటికీ మూగజీవాల మౌనరోదనను మాత్రం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు వ్యాధులు సోకితే తగిన వైద్యం అందించేందుకు ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందులు లేని దుస్థితి నెలకొందని అన్నారు. ఎమర్జెన్సీ మందులతో సహా పెయిన్ కిల్లర్స్, విటమిన్స్, యాంటీ బయాటిక్స్ వంటి అన్ని రకాల మందుల సరఫరా 9 నెలలుగా నిలిచిపోయిందని హరీష్‌రావు అన్నారు. పాలిచ్చే జీవులకు పొదుగు వాపు, గాలి కుంటు వ్యాధులు సోకితే ఒక్కో మూగ జీవిపై పాడి రైతులు రూ. 2 వేల దాకా ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. ఇది వారికి అదనపు ఆర్థిక భారమవుతుందని చెప్పారు. మూగజీవాల్లో అంతర పరాన్న జీవులను నివారించేందుకు మూడు నెలలకు ఒకసారి నట్టల నివారణ మందులను తప్పనిసరిగా వేయాల్సి ఉంటుందని చెప్పారు. 9 నెలల నుంచి నట్టల నివారణ మందులు సరఫరా చేయకపోవడంతో కాలేయం, జీర్ణాశయం, చిన్నపేగు భాగాల్లో పరాన్న జీవులు చేరి రక్తహీనతకు గురి చేస్తున్నాయని హరీష్‌రావు అన్నారు. రోగ నిరోధకశక్తి తగ్గి మూగజీవాలు బలహీనంగా మారుతున్నాయన్నారు. వ్యాధుల బారిన పడ్డ జీవులు ఆస్పత్రుల్లో మందుల కొరత కారణంగా సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు వాహన ఉద్యోగులు సకాలంలో వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారని హరీష్‌రావు అన్నారు. కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన చెందుతున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం ఒక్కసారి కూడా సమీక్ష నిర్వహించకపోవడం మూగజీవుల సంరక్షణపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపిస్తుందన్నారు. నిర్లక్ష్యం వీడి తగిన చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు కోరారు.

# నేతల భవనాలను కూల్చిన తర్వాతే సామాన్యులవి

**మొదటి పేజీ తరువాయి**



చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తన ఇల్లు బఫర్ జోన్ పరిధిలోని లేదని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెబుతున్నారని ఓ మీడియా ప్రతినిధి కేటీఆర్‌ను ప్రశ్నించగా ఆయన ఈ విధంగా బదులిచ్చారు. పొంగులేటికి అంత శ్రమ అవసరం లేదు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాలకు సంబంధించి శాటిలైట్ మ్యాప్స్ ఉన్నాయి. ఆయన అంత బాధపడాల్సిన అవసరం కూడా లేదు. ఎలా చెరువులు పూడ్చి కట్టారో అవన్నీ కూడా శాటిలైట్ ఇమేజేస్ ఉన్నాయి. చూసుకోండి రంగనాథ్ గారితో మాట్లాడుకోమనండి. ఎఫ్‌టీఎల్, బఫర్‌లో ఉన్న నిర్మాణాలను మొదట కూల్చడం ప్రారంభించండి. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్, కేవీపీ రామచంద్రరావు, మధుయాష్కీ, గుత్తా సుఖేందర్ రెడ్డి లాంటి నేతల భవనాలను కూల్చేసి ఆ తర్వాత సామాన్యుల భవనాలను కూల్చేయండి అని కేటీఆర్ సూచించారు.

చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తన ఇల్లు బఫర్ జోన్ పరిధిలోని లేదని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెబుతున్నారని ఓ మీడియా ప్రతినిధి కేటీఆర్‌ను ప్రశ్నించగా ఆయన ఈ విధంగా బదులిచ్చారు. పొంగులేటికి అంత శ్రమ అవసరం లేదు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాలకు సంబంధించి శాటిలైట్ మ్యాప్స్ ఉన్నాయి. ఆయన అంత బాధపడాల్సిన అవసరం కూడా లేదు. ఎలా చెరువులు పూడ్చి కట్టారో అవన్నీ కూడా శాటిలైట్ ఇమేజేస్ ఉన్నాయి. చూసుకోండి రంగనాథ్ గారితో మాట్లాడుకోమనండి. ఎఫ్‌టీఎల్, బఫర్‌లో ఉన్న నిర్మాణాలను మొదట కూల్చడం ప్రారంభించండి. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్, కేవీపీ రామచంద్రరావు, మధుయాష్కీ, గుత్తా సుఖేందర్ రెడ్డి లాంటి నేతల భవనాలను కూల్చేసి ఆ తర్వాత సామాన్యుల భవనాలను కూల్చేయండి అని కేటీఆర్ సూచించారు.

# జీహెచ్‌ఎంసీ పరిధిలో 21 మంది కమిషనర్ల ట్రాన్స్‌ఫర్

**మొదటి పేజీ తరువాయి**

ఉన్న స్నేహ శబరిష్‌కు ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అడ్మిన్ అడిషనల్ కమిషనర్‌గా మహేష్ కులకర్ణి
రెవెన్యూ జాయింట్ కమిషనర్‌గా ఉమాప్రకాష్
స్పోర్ట్స్ జాయింట్ కమిషనర్‌గా వాణిశ్రీ ముకుంద రెడ్డి డిప్యూటీ కమిషనర్ శేరిలింగంపల్లి
రజనీకాంత్ రెడ్డి డిప్యూటీ కమిషనర్ ఖైరతాబాద్ జగన్ డిప్యూటీ కమిషనర్ కాప్రా మోహన్ రెడ్డి డిప్యూటీ కమిషనర్ చందానగర్ అరుణ కుమారి డిప్యూటీ కమిషనర్ ఫలక్నామా శైలజ డిప్యూటీ కమిషనర్ సంతోష్ నగర్
కే జయంతి రావు జాయింట్ కమిషనర్ హెల్త్ రాధా జాయింట్ కమిషనర్ ఐటి సేవ ఇస్లావత్ డిప్యూటీ కమిషనర్ ఎల్బీనగర్
జాకియ సుల్తానా డిప్యూటీ కమిషనర్ యూసఫ్ గూడా
ఎన్ సుధాంశ్ జాయింట్ కమిషనర్ స్వచ్ఛభారత్ మిషన్
డి శంకర్ సింగ్ డిప్యూటీ కమిషనర్ సాలిడ్ వెస్ట్ మేనేజ్మెంట్ చార్మినార్ జోన్

# 19 ప్రాజెక్టులు, పనులను స్పీడ్ పరిధిలోకి తెచ్చిన సర్కార్

**మొదటి పేజీ తరువాయి**

అండ్ ఎఫెక్టివ్ డెలివరీ (స్పీడ్) పేరుతో కొత్త కార్యాచరణ రూపొందించింది. తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 19 ప్రాజెక్టులు, పనులను స్పీడ్ పరిధిలోకి తెచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీటిని స్వయంగా పర్యవేక్షిస్తారు. పనుల తీరు, పురోగతిపై సంబంధిత విభాగాల అధికారులతో నెలకోసారి సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. ఈ పనులన్నింటినీ నిర్ణీత వ్యవధిలో సమర్థవంతంగా పూర్తి చేయాలనేది స్పీడ్ ప్రధాన లక్ష్యం. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రామాణికమైన మౌలిక సదు-పాయాల కల్పనలో వివిధ విభాగాల మధ్య ఉన్న అడ్డంకులు, అవరోధాలు అధిగమించేందుకు స్పీడ్ ప్రత్యేక చొరవ తీసుకోనుంది. స్పీడ్ కింద చేర్చిన పనుల పురోగతిపై సీఎం రేవంత్ రెడ్డి నెలకోసారి సమీక్ష నిర్వహిస్తారు. దీని వల్ల ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా నేరుగా ముఖ్యమంత్రి స్థాయిలో అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు వీలుంటుంది. పట్టణాలు సహా అన్ని ప్రాంతాల్లోని అభివృద్ధి పనులపై స్పీడ్ దృష్టి కేంద్రీకరిస్తుంది. స్పీడ్ ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించేందుకు ఆయా విభాగాలు ప్రత్యేక విధానం అనుసరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. క్రమం తప్పకుండా పనితీరు సమీక్షించుకుని పర్యవేక్షణకు ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో భాగంగా తమ పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టులు, పనులపై సంబంధిత విభాగాలు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేస్తాయి. స్పీడ్ ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా ప్రణాళిక విభాగం ఆన్ లైన్ పోర్టల్ రూపొందిస్తుంది. ఏ రోజుకు ఎంత పని జరిగిందనే అప్ డేట్ డేటాను అందులో పొందుపరచాలి. ఏ గడువులోగా ఎంత పని జరుగుతుందనే నిర్ణీత కాల వ్యవధిని ఆయా విభాగాలు ఆన్ లైన్ పోర్టల్లో అప్డేట్ చేయాలి. ఎప్పటివరకు ఏఏ పనులు పూర్తవుతాయనే అంచనాలను సైతం పోర్టల్‌లో ఉంచాలి.

**స్పీడ్ ప్రోగ్రామ్‌లోని 19 ప్రాజెక్టులు ఇవే**

1. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్
2. శాటిలైట్ టౌన్ల అభివృద్ధి
3. మెట్రో రైలు విస్తరణ
4. జీహెచ్ఎంసీ పునర్ వ్యవస్థీకరణ
5. రీజినల్ రింగ్ రోడ్
6. హైదరాబాద్ సిటీలో ఎలివేటెడ్ కారిడార్లు
7. రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాలు
8. ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణం
9. మహిళా శక్తి పథకం అమలు
10. జిల్లా సమాఖ్య భవనాల నిర్మాణం
11. రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌లు
12. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల సంస్థాగత అభివృద్ధి
13. ఐటీఐలలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు
14. కొత్త ఉస్మానియా హాస్పిటల్
15. 15 కొత్త నర్సింగ్, 28 కొత్త పారా మెడికల్ కాలేజీలు
16. హెల్త్ టూరిజం ప్రమోషన్
17. ఎకో టూరిజం ప్రాజెక్టుల ప్రమోషన్
18. టెంపుల్ సర్క్యూట్స్ టూరిజం
19. యాంటీ డ్రగ్స్ స్ట్రాటజీ అమలు

తీన్మార్
తెలుగు దినపత్రిక

## స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాతృత్వం ఎక్కడ

రాజ్యాంగం ఎంత గొప్పదైనా, ఉత్తమమైనదైనా దానిని అమలు చేసే పాలకులు ఉత్తములు కాకపోతే రాజ్యాంగ లక్ష్యాలు నెరవేరవు' అన్నారు డా. బి.ఆర్.అంబేద్కర్. స్వాతంత్రం వచ్చిన తొలినాళ్లలో పాలకులు స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తితో పాలన సాగించారు. అందుకే మొదటి పంచవర్ష ప్రణాళిక విజయవంతం అయింది. సాగునీటి ప్రాజెక్టులు, కొన్ని భారీ పరిశ్రమలు దేశంలో నెలకొల్పబడ్డాయి. తర్వాతి పదేళ్ల పాటు కూడా కొంత సానుకూల వాతావరణం కొనసాగినా, రాను రానూ అధికారమే లక్ష్యంగా సాగిన రాజకీయాల కారణంగా పాలన గాడితప్పుతూ వచ్చింది. ఎన్నికల్లో గెలుపు కోసం కుల, మత, ధన ప్రభావాలను నాయక శ్రేణి పెంచి పోషిస్తూ వచ్చింది. దీంతో రాజ్యాంగం అనేది అప్రస్తుతమనే భావన పాలక వర్గాలలో బలంగా ఏర్పడిపోతూ వచ్చింది.రాజ్యాంగం అంటే పెత్తనం చెలాయించే సాధనం కాదని అది కేవలం సమాజంలో అసమానతలను చట్టబద్ధంగా తొలగించి నవ జీవనాన్ని క్రమ పద్ధతులలో నడిపే ఒక మార్గదర్శిగా ఉండాలని' అంబేద్కర్ కోరుకున్నారు. కానీ, ఇన్నేళ్ల స్వతంత్ర పాలనలో అత్యధిక సంఖ్యాకులైన సామాన్య ప్రజానీకం ప్రాథమిక అవసరాలైన నివాసం, విద్య, వైద్యాలకు దూరంగా ఉండిపోయారు. ఈ వర్గాల ప్రజల ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీదనే ఆధారపడుతూ అత్యంత దీన స్థితిలో తమ జీవితాలను వెళ్లదీస్తూ రావటం మనం చూస్తున్నాం. మరోవైపు దేశంలోని రాజకీయ పక్షాలు కుటుంబ పాలన, కుల, మత, వర్గ రాజకీయాల పేరుతో రాజ్యాంగాన్ని తమకు అనుకూలంగా మలచుకుంటూ ఇప్పుడున్న పరిస్థితిని మరింత దిగజార్చే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీల నేతలు భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలు, దేశపు వాస్తవిక స్థితి, బహుళత్వపు విలువల కంటే.. తమ పార్టీ నేతల మనోభావాలకే పెద్దపీట వేస్తూ వారికి పూర్తి విధేయులుగా మారిపోవటం విషాదం. దీంతో ప్రజల సమస్యలను చర్చించాల్సిన చట్టసభలలో ఎలాంటి చర్చలు లేకుండానే దేశ భవిష్యత్తును నిర్ణయించే బిల్లులు అలవోకగా చట్టాలుగా మారిపోతున్నాయి. తమ కళ్లముందే ఇలాంటి పరిణామాలు జరుగుతున్నప్పటికీ, తాము ఓటు వేసి గెలిపించిన ప్రభుత్వాలను, పార్టీలను సామాన్య ప్రజలు నిలదీయలేకపోవటం ప్రపంచపు అతిపెద్ద ప్రజాస్వామ్యపు బలహీనతగా మారిపోయింది. స్థానిక పాలనలోనూ ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాల్సినంతగా మన పౌరుల చైతన్యం పడిపోవటంతో.. లోకల్ బాడీ ఎన్నికల్లోనూ సీఎం రాజకీయ ప్రచారం చేయాల్సి వస్తోంది. దీంతో కింది స్థాయిలో.. కొత్త నాయకత్వం రావటం లేదు. ఇదీ మన ప్రజాస్వామ్యం.దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు, రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు నిండినా, రాజ్యాంగంలో పేర్కొన్న స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాతృత్వం వంటివి పేదలు, దిగువ వర్గాలకు అందని ద్రాక్షగానే మిగిలాయి. మరోవైపు, పాలక వర్గాల ఒంటెత్తు పోకడలు, ఏకపక్ష నిర్ణయాలతో.. రాజ్యాధికారంలో తమకు న్యాయమైన వాటా దక్కటం లేదనే అసంతృప్తి దిగువ వర్గాల యువతలో పెరుగుతూ పోతోంది. దేశపు ఉమ్మడి వనరులలో తమ వాటాను తమ కళ్లముందే కార్పొరేట్లకు కట్టబెడుతున్న పాలక వర్గాలను నిలదీయటానికి వారికి వేదికలూ లేకుండా పోతున్నాయి. ఆర్టికల్ 14 సమాజంలో పౌరులందరూ సమానమేనని, ఈ విషయంలో ప్రభుత్వాలు ఎలాంటి వివక్షత చూపరాదని చెబుతోంది. కానీ, ఇప్పట్లో ఇవేవీ బలహీన వర్గాలకు అందేలా కనిపించటం లేదు. సమాజంలో నేటికీ వారు ఏ హక్కులూ లేని, ద్వితీయ శ్రేణి పౌరులుగానే బతుకుతున్నారు. విద్య, ఉద్యోగాల్లో వివక్షత, ఆదివాసీ, గిరిజనులు హక్కుల విషయంలో గళం విప్పిన కార్యకర్తలను అరెస్టు చేసి జైల్లో పెట్టడం జరుగుతోంది. దీంతో రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛ దిగువ వర్గాల ప్రజలకే లేదా? అనే అనుమానం కలుగుతోంది. ప్రైవేటీకరణ కారణంగా ప్రభుత్వ రంగ సంస్థలు మూతబడటం, అందిన కాడికి అమ్మేసే ప్రక్రియ కారణంగా ప్రభుత్వ ఉద్యోగాలే లేకుండా పోవటంతో విద్య, ఉద్యోగాల్లో న్యాయమైన వాటా కోరే వాతావరణమే నేడు లేకుండా పోతోంది. ఉన్న ఉద్యోగాలనూ ఏళ్ల తరబడి భర్తీ చేయకుండా ఎన్నికల ముందు హడావుడి చేయటమే జరుగుతోంది. దీంతో దిగువ వర్గాలనుంచి చదువుకుని పట్టా పుచ్చుకున్న తొలితరం యువత నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఉపాధి లేని విద్య వారి కుటుంబాలను ఆర్థికంగా మరింత కుంగదీస్తోంది.మరోవైపు మనదేశంలో ఎన్నికలు అనేది అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారుతోంది. చట్టసభలు ధనికుల అడ్డాలుగా మారుతున్నాయి. దర్యాప్తు సంస్థలు నిష్పాక్షికతపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వ బ్యాంకులనుంచి కార్పొరేట్లు తీసుకున్న రూ. 10.72 లక్షల కోట్ల ఋణాన్ని కేంద్రం మాఫీ చేసిందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఎకానమీ రెండేళ్ల నాడు వెల్లడించింది. వీటిలో 85 శాతం రుణాలు కార్పొరేట్ కంపెనీలు చెల్లించాల్సినవే కావటం గమనార్హం. మరోవైపు, 2020-21లో బడా కార్పొరేట్స్ లాభం 5.5 లక్షల కోట్లు, 2021-22లో 9.3 లక్షల కోట్లతో దేశంలో గుప్పెడు మందితో కూడిన ప్రభుత్వ అనుకూల సూపర్ రిచ్ వర్గం బలపడింది. దేశంలోని ఒక శాతంగా ఉన్న ధనిక కుటుంబాల చేతిలో 42.5 శాతం, పది శాతం మంది చేతిలో 74.3శాతం, తొంభై శాతం చేతిలో 25.7 శాతం దేశ సంపద కేంద్రీకృతమైంది. విచిత్రంగా దేశంలో సగం జనాభా మొత్తం సంపద విలువ 2.8 శాతానికే పరిమితమైంది. గత రెండేళ్ల నుంచి ఈ సంపద కేంద్రీకృతం కావటం నిలకడగా సాగుతూనే ఉంది. ఈ ఆర్థిక గణాంకాలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థల పనితీరుకు అద్దం పడుతున్నాయి. ధేశ జనాభాకు సరిపడా ఉద్యోగాల కల్పన జరగక నిరుద్యోగం పెరిగిపోతుండగా, ఉన్నత విద్యా సంస్థల్లో చదువుకున్న యువత దేశం విడిచి, శాశ్వతంగా విదేశాలకు వలస పోతోంది. ఈ పరిణామాలను చూసినప్పుడు మన స్వాతంత్ర్యోద్యమం, మనం రాసుకున్న రాజ్యాంగపు లక్ష్యాలు నెరవేరలేదనే నిర్వేదం కలుగుతోంది.చట్టసభల్లో గణనీయమైన మెజారిటీ సాధించిన తర్వాత పార్టీలు, అవి ఏర్పరచే ప్రభుత్వాల వైఖరి సామాన్యులను నివ్వెరపరుస్తోంది. ఒకవైపు అంతులేకుండా సాగుతున్న అధికార దుర్వినియోగం, చాపకింద నీరులా సాగే అవినీతి కారణంగా మన రాజ్యాంగం నిర్మించిన వ్యవస్థలను ఒక్కొక్కటిగా కుప్పకూలి పోయే వాతావరణం దేశంలో ఏర్పడుతోంది.

# మంత్రి ఉత్తంకు కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ కార్యకర్తలు

### మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ నరసింహారావు



పాలకవీడు, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): హుజూర్ నగర్ నియోజక వర్గంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏంయల్ఏ పద్మావతి రెడ్డి ల కృషితో గ్రామ పంచాయతీ భవనాలు మరియు అంగన్వాడి భవనాలు మంజూరయ్యాయి సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం రాఘవాపురం గ్రామంలో గ్రామపంచాయితీ భవనానికి 20 లక్షలు మంజూరు చేశారు ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కి ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన పాలకీడు మండలం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ నర్సింహారావు, ఎం సత్యనారాయణ, బుడిగ సైదులు ఎస్సీ సెల్ అధ్యక్షుడు కే అప్పిరెడ్డి, టి వెంకటేష్, ఎస్ వెంకటేశ్వర్లు, ఆర్ అన్నారావు, ఎం సుధాకర్ రెడ్డి, ఇంజమూరి సైదులు, జి గోబ్రియా, ఎం శ్రీను, సిహెచ్ ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు

# జూనియర్ కళాశాల నూతన ఇంచార్జ్ ప్రిన్సిపాల్ గా భాగ్యవర్ధన్ రెడ్డి



ఆత్మకూర్, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్జేడిఐఈ వరంగల్ ఆదేశాల మేరకు కళాశాల నూతన ఎఫ్ఎసి ప్రిన్సిపాల్ గా ఎం భాగ్యవర్ధన్ రెడ్డి బాధ్యతల స్వీకరించారు. భాగ్య వర్ధన్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత 30 సంవత్సరాలుగా అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. ఆయన చేసిన సేవలను గుర్తించి కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ గా బాధ్యతలు అప్పగించారు ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం ఆధ్వర్యంలో మరియు వనపర్తి జిల్లా ఒకేషనల్ లెక్చరర్స్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఇట్టి కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు టీజే విశ్వేశ్వర్ కురుమూర్తి, రాఘవేంద్రరావు, జమ్మన్న, సునీల్ కుమార్, వోకేషనల్ లెక్చరర్స్ చంద్రశేఖర్ రెడ్డి ఉదయభాస్కర్ రెడ్డి శ్రీనివాసులు సునీల్ కళాశాల అధ్యాపకులు రాఘవేందర్, పావని, లలిత, ఆఫీస్ సిబ్బంది రమణ రహీం తదితరులు పాల్గొన్నారు.

# గొంతెండుతున్న పల్లెలు.. అధికారుల నిర్లక్ష్యమేనా..?

### గుప్పెడు నీళ్ళ కోసం నానా తిప్పలు
### నాలుగురోజులకోసారి మిషన్ భగీరథ నీరు
### త్రాగునీటికి సమస్యకు శాశ్వత చర్యలు తీసుకోవాలి
### మదనాపురం మండల ప్రజలు



దేవరకద్ర ప్రతినిధి, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): గుక్కెడు మంచినీరు కోసం జనం నానాపాట్లు పడుతున్నారు.ప్రతి రోజూ ఉదయం గ్రామ సమీపంలోని బోరుబావుల, వాటర్ ట్యాంక్ వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకొని గొంతు తడుపుకుంటున్నామని ప్రజలు చెబుతున్నారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలములోని ఏడ గ్రామాలలో బోరు బావులే దిక్కు. గ్రామంలో తాగునీటి కోసం రూ.లక్షలు వెచ్చించి నీటి ట్యాంకులు నిర్మించినా అవి ఏ మాత్రం ఉపయోగపడడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మిషన్ భగీరథ నీరు అందిస్తామని చెప్పినా ఇంటింటికీ రావడం లేదని, ఒకవేళ వచ్చిన వారానికోసారి, మూడు రోజులకోసారి వస్తాయని, అది కూడా అరగంట మాత్రమేనని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నదని పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రతి గ్రామానికి ప్రతి ఇంటికి త్రాగునీరు సరఫరా కోసం కోట్ల రూపాయలను ఖర్చుచేసి పనులు చేస్తే అధికారుల నిర్లక్ష్యంతో నీటి సరఫరా మాత్రం జరగడం లేదని అగ్ర వ్యక్తం చేస్తున్నారు. త్రాగునీటి కోసం మండలంలోని అన్ని గ్రామాలలో భగీరథ నీళ్లు సరఫరా అడపాదడపా వస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో మండలంలోని ప్రజలు నీళ్ళ కోసం తిప్పలు తప్పడం లేదు. అన్ని గ్రామాలలో రెండు నుండి మూడు వాటర్ ట్యాంక్ లు ఉండగా వాటి అన్నిటికీ నీళ్లు సరఫరా కావడం లేదు.క్షేత్రస్థాయిలో లోపాలను సరిచేయాలని ప్రజలు మొత్తుకుంటున్న ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుంది. గ్రామాలలో బిందెడు నీటి కోసం యుద్ధం చేయాల్సిన పరిస్థి తులు కనిపిస్తున్నాయి. ప్రతి ఏటా తాగునీటి సమస్య తలెత్తడం ప్రభుత్వలు యుద్ధ ప్రాతిపదికన ఆసమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టడం తంతుగా జరుగుతోంది. అయితే, మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్న గ్రామాలపై పూర్తిస్థాయిలో దృష్టిసారించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు ప్రతి ఏటా విఫలం అవుతూనే ఉన్నారని ప్రజలు అంటున్నారు.ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మండలంలోని ప్రతి గ్రామంలో నీటి కష్టాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని మండలం ప్రజలు కోరుతున్నారు.

# ప్రాథమిక హాస్పటల్ అభివృద్ధి పరచండి

### హెల్త్ సెంటర్లలో సిబ్బంది కొరతను తీర్చండి
### ఐఎన్టియుసి ఆశ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి అవి రెండ్ల సీత



నేరేడుచర్ల, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): హెల్త్ సెంటర్లలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతో ఇద్దరు చేయాల్సిన పనిని ఒకరితోనే చేయిస్తుండడంతో ఆశ వర్కర్లపై అధిక పని భారం పడుతుంది అని ఆశా వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి అవి రెండ్ల సీత అన్నారు. ఆశ వర్కర్లకు టార్గెట్ పనులు (ఏ యన్ సి, ఇమ్మ్యునైజేషన్ టార్గెట్) ఉండటం వలన ఆశాలు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని ప్రతి 2వేలు (అర్బన్ లో) ఒక వెయ్యి (రూరల్) జనాభాకు ఒక ఆశా వర్కర్ అన్నారు. కానీ చాలా ప్రాంతాలలో ఆశ వర్కర్లు లేకపోవడం వలన 4000 నుండి 6000 జనాభా కేవలం ఒకే ఆశా సేవలు అందిస్తుందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ఆశా వర్కర్లను పెంచినట్లయితే ఎప్పటికప్పుడు అందరికీ హెల్త్ చెకప్ తో పాటు సీజనల్ సమయంలో అప్రమత్తంగా ఉండే అవకాశం ఉంటుందని అన్నారు సీజనల్ వ్యాధులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే ప్రజలపై ఆర్థిక భారం పడదని కాబట్టి ఖాళీగా ఉన్న ఆశా వర్కర్లను, ఏఎన్ఎం పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

# ఘనంగా నేషనల్ స్పేస్ డే




ఆత్మకూరు, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని స్థానిక శ్రీవాణి హైస్కూల్లో శుక్రవారం మొదటి నేషనల్ స్పేస్ డే ను ఘనంగా నిర్వహించారు.ఇట్టి కార్యక్రమంలో భాగంగా గత సంవత్సరం ఇస్రో శాస్త్రవేత్తలు పంపిన చంద్రయాన్ 3 విజయవంతంగా చంద్రునిపై ఆగస్టు 23 2023 తేదీన చేరడంతో భారత ప్రభుత్వం ఆగస్టు 23న నేషనల్ స్పేస్ డే ప్రకటించిన సందర్భంగా మొట్టమొదటి నేషనల్ స్పేస్ డే ను శ్రీవాణి హై స్కూల్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఇట్టి పోటీలో 30 మంది విద్యార్థులు పాల్గొని విద్యార్థులు ప్రదర్శించిన చిత్రాలను సేకరించి మంచి ప్రతిభను ఘనపరిచిన విద్యార్థికి పాఠశాల ప్రిన్సిపల్ బహుమతులతో అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో డ్రై డే కార్యక్రమం



ఆత్మకూర్, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆత్మకూరు మున్సిపల్ ఆధ్వర్యంలో శుక్రవారం రోజు ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీజనల్ వ్యాధుల గురించి పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. అనంతరం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు సలహాలు తెలియజేస్తూ కరపత్రాలు పంచడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ చైర్పర్సన్ గాయత్రి రవి కుమార్ యాదవ్, పుర కమీషనర్ నాగరాజు, వైస్ చైర్పర్సన్ విజయభాస్కర్ రెడ్డి, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు వార్డ్ కౌన్సిలర్లు మహేశ్వరి, కార్యాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి



టేక్మాల్, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): ఫిజియో థెరపీని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మౌనిక అన్నారు. గురువారం టేక్మాల్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఫీజియో థెరపీ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ మెడ నొప్పులు నరాల బలహీనత ఉన్న వారికి వ్యాయామ పరీక్షలు చేశారు. విద్యార్థులు ప్రతి రోజు ఇంటి వద్ద వ్యాయామం తప్పని సరిగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్ ఇ ఆర్ పి శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

# డిసిసిబి చైర్మన్ పదవి ఏకగ్రీవంగా ఎన్నిక



మహబూబ్ నగర్ జిల్లా, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): మహబూబ్ నగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నూతన చైర్మన్ గా మామిళ్ళ పల్లి విష్ణువర్ధన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా చైర్మన్ కి మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, మహబూబ్నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, మేఘా రెడ్డి, పర్నికా రెడ్డి, అనిరుధ్ రెడ్డి, మైనారిటీ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ నూతనంగా ఎన్నికైన చైర్మన్ కి శుభాకాంక్షలు తెలియజేసి,రైతు సంక్షేమానికి కృషి చేయాలని కోరారు.

# మండల నూతన వ్యవసాయ అధికారిగా ముంజ మహేష్



కన్నాయిగూడెం, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీలలో భాగముగా ముంజ మహేష్ మండల వ్యవసాయ అధికారి మహదేవ్ పూర్ నుండి బదిలీ అయి ములుగు జిల్లా ఏటురునాగారం డివిజన్ కన్నాయిగూడెం మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది.

# పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

## ప్రణీత శ్రీకాంత్ గౌడ్

## ఛైర్పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్



కాప్రా, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): మన పరిసరాల్లో వాడకంలో లేని పాత్రలు, సామాగ్రిలో నీరు నిల్వ లేకుండా చూడాలని దమ్మాయిగూడ మున్సిపల్ ఛైర్పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్ ప్రజలకు వివరించారు. డ్రై డే ఫ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని 3వ వార్డులో కమిషనర్ నాగమణితో కలిసి పర్యటించారు. వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గృహాల వద్ద పరిసర ప్రాంతాల్లో, ప్రభుత్వ, అంగన్ వాడి స్కూల్ వద్ద పిచ్చి మొక్కలు ఉండకుండా చూడాలని, మురికి కాలువలో నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్, దోమలు ఉండకుండా కెమికల్ చల్లడము జరిగింది. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటికీ తిరుగుతూ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి అవగాహన కల్పించారు. ఇళ్లలో వాడే కుండీలలోని నీటిని రెండు రోజులకొకసారి మార్చాలని ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచకూడదని, కొబ్బరిబొండాలు, టైర్ లలో నీరు, ప్లాస్టిక్ వంటి వస్తువులు ఇళ్ల పరిసరాల్లో వుంచకుండా చూడాలని సూచించారు. ఎక్కువ కాలం నీరు నిల్వ వలన దోమలు ఉత్పత్తి అయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. ఎప్పటికప్పుడు పరిసరాలు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కొత్త హేమలత శ్రీనివాస్ గౌడ్, సానిటేషన్ ఇన్స్పెక్టర్ ప్రభు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, మహిళా సంఘాల నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో రోడ్లపై ప్రమాదాలు జరగకుండా నివారించాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్



ములుగు జిల్లా, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): జిల్లాలో రోడ్లపై ప్రమాదాలు జరగకుండా నివారించాలని, ప్రమాదాలు కారణమయ్యే ప్రాంతాలను గుర్తించి రక్షణ జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో ఉన్న జాతీయ రాష్ట్ర రహదారులపై ప్రమాదాలు తగ్గించడానికి అవలంబించాల్సిన విధానాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్ పి శభరిష్ తొ కలసి జిల్లా రోడ్డు సేఫ్టీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారులపై ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాలలో ప్రమాదాలు జరగకుండా నివారించడం కోసం పోలీసు, రోడ్లు మరియు భవనాలు, ఎక్సైజ్, ఆర్టీవో, ఆర్టీసీ తదితర శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారి 163 పై ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఆ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ వద్ద ఎటువంటి చర్యలు తీసుకోవాలి అనే విషయాలపై సమావేశంలో చర్చించారు. మొదట అధికంగా ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ ప్రాంతాల వద్ద పోలీసులు, ఆర్ అండ్ బి అధికారులు వెళ్లి తనిఖీ చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. నెల రోజుల్లో మళ్లీ ఒకసారి సమావేశం నిర్వహించి ప్రమాదాలు నివారించడానికి అన్ని శాఖల సమన్వయంతో రహదారుల వారిగా సమీక్ష చేస్తామన్నారు. సాంకేతిక సమస్య వల్ల ఒక ప్రమాదం కూడా జరగవద్దని, అని శాఖలు సమన్వయతో పనిచేసి ప్రాణాలను నిలబెట్టాలని కోరారు. ఎస్పి శభరిష్ మాట్లాడుతూ వేగాన్ని తగ్గించే నివారణ చర్యలు ఏమైనా ఉంటే వాటిని అభివృద్ధి చేయాలని, వేగాన్ని తగ్గించడానికి బారికేట్స్ తో పాటు, డంబుల్ స్ట్రిప్స్ పెట్టాలని, సైన్ బోర్డ్ లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా పోలీస్ శాఖ ఇతర శాఖలతో సమన్వయంగా పనిచేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. అన్ని శాఖలు కలిసి ఒక్క ప్రాణం కూడా పోకుంట చూడాలని కోరారు. ఈ సమావేశంలో డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి. శ్రీజ, ఏ ఎస్పి శివం ఉపాధ్యాయ, ఆర్డిఓ సత్య పాల్ రెడ్డి, డిఎస్పీ రవీందర్, ఆర్ అండ్ బి, జాతీయ రహదారుల, పి ఆర్ ఇంజనీరింగ్ అధికారులు, ఆర్టీసీ అధికారులు, జిల్లా రవాణా శాఖ అధికారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పంపిణి




నేరేడుచర్ల, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): స్థానిక దిర్శించర్ల ప్రాథమిక పాఠశాల నందు లయన్స్ క్లబ్ అఫ్ నేరేడుచర్ల ద్వారా విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్సిల్, పెన్నులు పంపిణీ చేయడం జరిగింది
ఈ కార్యక్రమంలో దాత బిఆర్ యస్ నాయకులు రాపోలు నవీన్ కుమార్ ద్వారా సుమారుగా 60 మంది విద్యార్థినీ విద్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు జీలకర్ర రామస్వామి మాట్లాడుతూ బాలల చేతిలోనే ఈ దేశ భవిష్యత్తు ఉందని వారిని కంటికి రెప్పల్లా కాపాడాలని సూచించారు. బాలలు విద్యపై అధిక శ్రద్ధ చూపాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతోందని కానీ వారికి కావాల్సిన అవసరరాలు తిరిస్తే చదువు లో అద్భుతాలు చేసి చూపిస్తారు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్ రెడ్డి క్లబ్ సెక్రటరీ గుండ్రెడ్డి సైదిరెడ్డి క్లబ్బు సభ్యులు చిత్రం విశ్వనాథ్ కర్రీ సతీష్ రెడ్డి తక్కెళ్ళ నాగార్జున ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అంగన్వాడీ టీచర్ హాజరైనారు.

# ఈనెల 27, 28లలో గవర్నర్ పర్యటన

- పక్కద్బందీ ఏర్పాట్లు చేయాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్
- అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలి




ములుగు జిల్లా, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఈనెల 27, 28 తేదీలలో జిల్లా పర్యటన నేపథ్యంలో పక్కద్బందీ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్ పి షభరిష్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి. శ్రీజ, డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, ఏఎస్పి శివం ఉపాధ్యాయ లతో కలిసి గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 27 న ములుగు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాకు చెందిన ప్రముఖ రచయితలు కళాకారులు వివిధ జాతీయ రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలతో గవర్నర్ పరస్పరంగా చర్చిస్తారని, తదనంతరం జిల్లాలోని రామప్ప దేవాలయం, లక్నవరం సరస్సును సందర్శించి రాత్రి బస చేసి, మరుసటి రోజు హనుమకొండ కు చేరుకుంటారని కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులకు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తగా నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని అన్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ సత్య పాల్ రెడ్డి, జెడ్పీ సీఈవో సంపత్ రావు, డిఎస్పీ రవీందర్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): ఎల్ఆర్ఎస్ 2020లో ఎవరైతే దరఖాస్తు చేసుకున్నారో క్షేత్రస్థాయిలో విచారణ ప్రక్రియ చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులు విచారణ ప్రక్రియ నిర్వహణకు ఏర్పాటు చేసిన రెవెన్యూ, మున్సిపల్, గ్రామ పంచాయతి, ఇరిగేషన్ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 8310 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అట్టి దరఖాస్తులలో ఎవరైనా సక్రమంగా డాక్యుమెంట్లు పోర్టల్ లో అప్లోడ్ చేయనట్లయితే ప్రభుత్వం తిరిగి మరలా మొబైల్, మీ సేవా కేంద్రాల ద్వారా కాని రిజిస్టర్ డాక్యుమెంట్స్ అప్లోడ్ చేయడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వెరిఫికేషన్ కోసం రెవెన్యూ, మున్సిపల్, పంచాయతి రాజ్, ఇరిగేషన్ శాఖల ద్వారా 56 టీములు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. సోమ, మంగళవారం నుంచి ఏర్పాటు చేసిన టీములు గ్రామాలలో, మున్సిపాలిటీలలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు విచారణ నిర్వహణకు వస్తారని పేర్కొన్నారు. విచారణకు వచ్చిన అధికారులకు డాక్యుమెంట్లు అందచేయాలని అట్టి దరఖాస్తులను ఆన్లైన్లో అప్లోడ్ చేస్తారని ఆయన తెలిపారు. దరఖాస్తుదారులు సంబంధిత డాక్యుమెంట్లను అందుబాటులో ఉంచుకోవాలని, విచారణ ప్రక్రియ సజావుగా, సక్రమంగా నిష్పక్షపాతంగా పూర్తి చేయుటకు సహకరిం చాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిపిఓ నారాయణ రావు, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర రావు, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఆర్ఓఆర్ చట్టంపై అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షా



మహబూబాబాద్ జిల్లా, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశం మందిరంలో నూతన ఆర్ఓఆర్ చట్టంపై జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో అధ్యక్షతన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ తో కలిసి (వర్క్ షాప్) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ధరణి, నూతన ఆర్ఓఆర్ చట్టం కమిటీ సభ్యులు సునీల్, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ బానోతు మురళి నాయక్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భూమి సునీల్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే నూతన ఆర్ఓఆర్ చట్టం, రూపకల్పనలో ప్రజలు, రైతులు,సీనియర్ అధికారులు, నుండి అభిప్రాయ సేకరణ కోసం ఈ సమావేశాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగానే ఈరోజు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రజల మధ్యలో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రైతులకు సౌకర్యార్థము ఈ నూతన చట్టం రూపొందించుకోవడం జరుగుతుందని, గతంలో జరిగిన చిన్న చిన్న పొరపాట్లు, సమస్యలు పరిష్కారం అవుతాయాన్నారు. ప్రతి గ్రామానికి సంబంధించి హక్కుల రికార్డు తయారు చేయడం, దాని ద్వారా రైతులకు వివిధ రకాల సౌకర్యాలు కలుగుతాయని, ఏ సమయంలో ఏ విధంగా భూమి కొనుగోలు తదితర విషయాలకు సంబంధించి వివరాలు ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయడం తదితర అంశాలు రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి, సభ్యులు, రెవెన్యూ మంత్రి, కలిసి నిర్ణయం తీసుకోనున్నారని తెలిపారు. మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ బానోత్ మురళి నాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం 80 శాతం వరకు జిల్లాలో భూ సమస్యలు ఉన్నాయని వాటి యొక్క పరిష్కారం నూతన చట్టం ద్వారా అమలు జరుగుతుందన్నారు. కేసముద్రం మండలం, నారాయణపురం, మహబూబాబాద్ మండలం మన్నహాడ్, కంబాలపల్లి, గూడూరు మండలం సీతా నాగారం, లలో ముఖ్యమైన భూ సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సునీల్ గారి ద్వారా కోరారు. సమావేశంలో పాల్గొన్న రైతులు వివిధ వర్గాల ప్రజలు , వెంకన్న, ఆర్డీవో తొర్రూరు నరసింహారావు, న్యాయవాది సురేష్, రైతు ఏనుగు వెంకట్ రెడ్డి, మల్లయ్య, బోడ రమేష్, ఐలుమల్లు, మార్నేని వెంకన్న, మహబూబాబాద్ తహసిల్దార్ భగవాన్ రెడ్డి, తదితరులు వారి వారి అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ఈ చట్టం ద్వారా ప్రభుత్వ భూముల పరిరక్షణ చేయాలని, వివిధ మ్యుటేషన్లలో వేరుగా పడిన భూమిని విభజించాలని, మండలాల వారీగా రెవెన్యూ అధికారులు, సర్వేయర్లను, నియమించాలని, కొందరు సూచనలు తెలిపారు. అంతకుముందు రైతులు ప్రజలు సమావేశంలో పాల్గొన్న వివిధ వర్గాల వారి సందేహాలకు సునీల్ సమాధానాలు ఇచ్చారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు ప్రజలకు అవగాహన కల్పించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని సమావేశంలో పాల్గొన్న అతిథులు తెలిపారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో , మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నూతన చట్టంపై వర్క్ షాప్ సమావేశం నిర్వహించడం జరిగిందని, జిల్లా స్థాయిలో వచ్చిన అభిప్రాయాలను రాష్ట్రానికి పంపడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు అన్ని మండలాల తాహసిల్దార్స్, రైతులు, సీనియర్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా తరహాలో మహానగరంలో అధికారిని నియమించబోతున్నాం

## స్వచ్ఛదనం-పచ్చదనం మహానగరానికి వైభవం అన్యాక్రాంతాల్లో ఉన్న పార్క్ లకు పునఃవైభవం తీసుకువస్తాం



హన్మకొండ జిల్లా, ఆగస్టు 23 (తీన్మార్ న్యూస్): హైడ్రా తరహాలో మహానగరంలో డీసీపీ స్థాయి అధికారిని నియమించబోతున్నాం. పార్క్ అవరణాల్లో సాంఘిక కలాపాలకు చోటు లేకుండా చూడాలి. బాలసముద్రంలో అంగవైల్య పిల్లలకు 2కోట్లతో వసతి గృహం, ఆడిటోరియం, పార్క్ సుందరికరణ పనులకు భూమిపూజా చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య , కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, హనుమకొండ బాల సముద్రంలోని 30 వ డివిజన్ లో చిల్డ్రన్స్ పార్క్ ఆవరణలో 15వ ఆర్థిక సంఘం రూ. 2 కోట్ల నిధులతో నిర్మించబోతున్న అంగవైకల్య పిల్లలకు వసతి గృహం, ఆడిటోరియం నిర్మాణం, పార్క్ సుందరి కరణ కోసం ఈ రోజు వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి శంకుస్థాపన చేసారు. భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలనీ, నిర్ణత సమయంలో అందుబాటులో ఉండాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.



నిర్మాణ చేపట్టే ప్రదేశాన్ని పరిశీలించారు. పార్క్ ఆవరణలో నిర్మాణం చేపడుతున్న దృష్ట్యా చెట్లను పరిరక్షించేలా ప్రణాళికలను ఉంచాలని కోరారు. పార్క ఆవరణ మొత్తం కలియాతిరిగి పరిశీలించారు, పార్క్ ఆవరణలో ఎపుగా పెరిగిన పిచ్చిమొక్కలను వెంటనే తీసేయలని అధికారులకు ఫోన్ ద్వారా తెలిపారు. నిత్యం ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే కనీస బాధ్యత మనపై ఉందని అన్నారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ హైడ్రా తరహా అక్రమ కట్టడాల నిర్మలకు డీసీపి అధికారిని నియమించబోతున్నామని అన్నారు. తద్వారా పట్టణంలో ఖాబ్జాలకు గురైన పార్క్ స్థలాలు, ప్రభుత్వ స్థలాలు, ప్రయివేట్ స్థలాలకు విముక్తి కానుంది.మహానగరంలో ఉన్న భద్రకాళీ బండ్,పద్మక్షమ్మా గార్డెన్, ఏకాశీల పార్క్, పబ్లిక్ గార్డెన్ ఇతర పార్క్ ఆవరణలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీస్ శాఖవారికీ ఖచ్చితమైనా ఆదేశాలు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, స్థానిక మాజీ కార్పొరేటర్ కేశి రెడ్డి మాధవి రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షులు బంక సంపత్ యాదవ్, నాయిని లక్ష్మా రెడ్డి, బొంత సారంగం వల్లపు రమేష్ పార్టీ నాయకులు, వాకార్స్ అసోసియేషన్ సభ్యులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అగ్నికణం షోయబుల్లాఖాన్

మేడ్చల్: నిజాం నిరంకుశ పాలనలో ఖాసీం రాజ్వీచే హత్యకు గురైన జర్నలిస్ట్ షోయబుల్లా ఖాన్ కి మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ నివాళులు అర్పించారు. ఘట్కేసర్ పోచారంలోనీ సింగపూర్ టౌన్ షిప్ లో నివాసముంటున్న వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈటల మాట్లాడుతూ తెలంగాణ అగ్నికణం షోయబుల్లాఖాన్. తెలంగాణ మట్టిబిడ్డ,రేషం గల్లబిడ్డ. అణచివేతకు, దుర్మార్గాలకు వ్యతిరేకంగా పోరాడిన బిడ్డ. దేశమే గర్వించదగ్గ గొప్ప మహనీయుడు షోయబుల్లాఖాన్. అతి చిన్న వయసులోనే అరాచకాలను ఎదిరించాడు. తనకున్న మేధోశక్తితో కలాన్ని పట్టి ప్రజల పక్షాన నిలిచారు. ప్రజాఉద్యమాలకు స్ఫూర్తిని ఇచ్చిన బిడ్డ షోయబుల్లాఖాన్. ఖాసింరిజ్వి అతి దుర్మార్గంగా కిరాతకంగా షోయబుల్లా ఖాన్ ను హత్య చేశాడు. ఆయన చనిపోయే ముందు కూడా నేను చనిపోవచ్చు కానీ నా రచనలు ప్రజల్ని చైతన్యవంతం చేస్తాయని చెప్పారు. అనేకమంది షోయబుల్లా ఖాన్లు పుట్టుకొస్తారని గర్వంగా రాసిన వ్యక్తి ఆయన. 76వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులు అర్పిస్తున్నాను.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు "బాదం ప్రవీణ్" జన్మదిన వేడుకలు

ములుగు, ఆగస్ట్ 23 (తీన్మార్ న్యూస్): శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న టీమ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు అచ్చునూరి కిషన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బాదం ప్రవీణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి కొగిల రాంబాబు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుక్కల నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ బండి మధు, ఉల్లేరావు శ్రావణ్,రాజు,నరేష్,రమేష్,అభిమానులుతదితరులు పాల్గొన్నారు.



# మంత్రివర్గంలో చోటు ఊహాగానమే

**- ఎమ్మెల్సీ కొత్త పాత్ర**

**- ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటాను**

**- విధ్వంసకారులకు ప్రశ్నించే నైతికత ఎక్కడిది?: ప్రొఫెసర్ కోదండరాం**



హైదరాబాద్: తనకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించబోతున్నట్లుగా జరుగుతున్న ప్రచారమంటూ ఊహాగానాలు మాత్రమేనని ఎమ్మెల్సీ, టీజేఎస్ అధ్యక్షులు కోదండరామ్ స్పష్టం చేశారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మంత్రి పదవిపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. కానీ విస్తృతమైన పాత్ర పోషించాలని కాంగ్రెస్ ప్రభుత్వం కోరుతున్నదని తెలిపారు. కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా టీజేఎస్‌కు ఎమ్మెల్సీ పదవిని ఇచ్చి మాట నిలబెట్టుకుందని తెలిపారు. కొన్ని కార్పొరేషన్ పదవులు రావాల్సి ఉన్నాయని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే విషయం రాష్ట్ర కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్సీ తనకు కొత్త పాత్ర అంటూ, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటానని తెలిపారు. పదేండ్లపాటు రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన బీఆర్ఎస్ నాయకులకు ప్రశ్నించే నైతికత ఎక్కడుందని ప్రశ్నించారు. గతంలో పురపాలకశాఖ మంత్రిగా పని చేసిన కేటీఆర్ ఉపయోగించుకున్న ఫాంహౌజ్ కూడా నిబంధనలకు విరుద్ధంగా ఉందంటే ఆ పాలన ఎలా చేశారో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. 2016 నుంచి రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో 12 లక్షల రేషన్ కార్డుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రుణమాఫీ కోసం కుటుంబాలను గుర్తిస్తున్న సందర్భంలో ఉమ్మడి రేషన్ కార్డుల జాబితాలోనే పేర్లు ఉండటంతో కొంత మేరకు సాంకేతికంగా ఇబ్బంది కలిగిందన్నారు. ఈ ఇబ్బందికి రేషన్ కార్డులు జారీ చేయని బీఆర్ఎస్ నిర్లక్ష్యమే కారణమని వివరించారు. రాజీవ్ గాంధీ విగ్రహం %–% తెలంగాణ తల్లి విగ్రహం మధ్య ఘర్షణ పెట్టవద్దని ఆయన అభ్యర్థించారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ముఖ్య ద్వారం వద్ద పెట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నదనీ, తెలంగాణ అస్థిత్వ చిహ్నాలను కాపాడేందుకు సర్కారు సిద్ధంగా ఉందని చెప్పారు. కాంగ్రెస్ హయాంలోనే స్థానిక సంస్థల్లో బీసీ కోటా తెచ్చారనీ, దాన్ని తెలుగుదేశం ప్రభుత్వం కూడా కొనసాగించిందని గుర్తుచేశారు. బీసీల ప్రాతినిథ్యం మరింత పెంచాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్‌కు, తెలంగాణ ఉద్యమకారులతో బంధం తెగిపోవడమే దాని ఓటమికి దారి తీసిందని తెలిపారు. ఎమ్మెల్సీగా కొత్త పాత్రను పోషించనున్న క్రమంలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు టీజేఎస్ కార్యాలయంలో శిక్షణా తరగతులు పెట్టుకున్నట్టు తెలిపారు.

గురుకులాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ, ప్రస్తుతం ఇబ్బందులు కొనసాగుతున్నాయని కోదండరాం తెలిపారు. వీటిని పరిష్కరించాల్సిన అవసరముందని చెప్పారు. ఉద్యోగ నియామకాల్లో ఖాళీల భర్తీకి అడ్డుగా ఉన్న జీవోను వన్ టైం అడ్జెస్ట్ మెంట్ కింద సవరించడం లేదా ఇతర పరిష్కార మార్గాలు వెతకాల్సి ఉందన్నారు. గ్రూప్ 1, 2, 3, 4ల కోసం ఒకే పరీక్షను నిర్వహిస్తే నిరుద్యోగులకు ఉపయుక్తంగా ఉంటుందని సూచించారు. ఎస్సీ వర్గీకరణను తాను మొదట్నించి సమర్థిస్తున్నట్టు గుర్తుచేశారు. ఎవరి వాటా వారు పొందడమే న్యాయమని స్పష్టం చేశారు. ఇందు కోసం ప్రభుత్వం ఒక కమిటీని వేసి హేతుబద్ధంగా అధ్యయనం చేయాలని సూచించారు. జీవో 317కు, రాష్ట్రపతి ఉత్తర్వులకు సంబంధించి ప్రాంతాల వారీగా ఎంపిక ప్రక్రియను అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం జోన్లను, జిల్లాలను అనాలోచితంగా చేయడంతో జీవో 317లో కూడా ఇబ్బందులు తలెత్తి, ఉద్యోగులు, ముఖ్యంగా మహిళా ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. స్థానికతను నిర్ణయించేందుకు, తెలంగాణ బిడ్డలు నష్టపోకుండా విస్తృతంగా చర్చించాల్సిన అవసరముందని కోదండరాం అభిప్రాయపడ్డారు. ప్రజలు స్వేచ్ఛగా కలిసేందుకు వీలుగా తనకు కేటాయించిన గన్ మెన్లను వద్దని తిరస్కరించినట్టు తెలిపారు.

# గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**- విప్ అడ్లూరి లక్ష్మణ్‌కు గెస్ట్ లెక్చరర్ల సంఘం వినతి**

**- అమర వీరుల స్థూపం వద్ద నివాళి**

హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 11 ఏండ్లుగా పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని గెస్ట్ లెక్చరర్ల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దామెర ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి దార్ల భాస్కర్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు.

1,654 మంది గెస్ట్ లెక్చరర్ల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. త్వరలో జరగనున్న 1,392 అధ్యాపక పోస్టుల భర్తీతో సంబంధం లేకుండా 11 ఏండ్లుగా పనిచేస్తున్న తమ సర్వీసును పరిగణనలోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రెన్యూవల్ ఉత్తర్వులను విడుదల చేయాలని కోరారు. అడ్లూరి లక్ష్మణ్ స్పందిస్తూ గెస్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. తప్పకుండా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. రెన్యూవల్ ఉత్తర్వులపై ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి



రామకృష్ణారావుకు ఫోన్ చేసి వెంటనే విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించే అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ కోడి మహేష్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎం బాబురావు, సిహెచ్ దేవయ్య, కోశాధికారి బండి కృష్ణ, నాయకులు వెంకటేశ్, ప్రసాద్, ఎస్ పరమేశ్, మల్లికార్జున్, యాదగిరి, చంద్రమోహన్, అరుణ, శివలీల, శ్రీధర్, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

# కాలుష్య జలాలతో చేపలు మృత్యువాత

**- సంగారెడ్డి జిల్లా మహబూబ్‌సాగర్ చెరువులో ఘటన**

**- పరిశీలించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

సంగారెడ్డి: కాలుష్య జలాల వల్ల సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మహబూబ్‌సాగర్ చెరువులో చేపలు మృత్యువాత పడ్డాయి. బుధవారం ఉదయం చేపలు పట్టేందుకు చెరువు వద్దకు వెళ్లిన మత్స్యకారులు నీటిపై తేలియాడిన చేపలను చూసి కన్నీరు మున్నీరయ్యారు. తమను ఆదుకోవాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి సమాచారం అందించారు. దీంతో ఇరిగేషన్, మత్స్యశాఖ, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి జగ్గారెడ్డి చెరువును పరిశీలించారు. నీటి కాలుష్యం వల్లే చేపలు చనిపోయినట్టు అధికారులు నిర్ధారించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. మహబూబ్‌సాగర్‌లో చేపలు పట్టి జీవనోపాధి పొందుతున్న కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. నీటి కాలుష్యం వల్లే చేపలు మృత్యువాతపడ్డాయని, చెరువులో పెద్దఎత్తున గుర్రపు డెక్క ఉందని అన్నారు. దాన్ని తొలగించాలంటే మహబూబ్‌సాగర్ పూడికతీత ఒక్కటే మార్గమని ఇందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి దామోదర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖను కలిసి చెరువు పూడికతీతకు నిధులు కేటాయించాలని కోరుతానని తెలిపారు. అధికారులు మహబూబ్‌సాగర్‌లోకి సంగారెడ్డి పట్టణ డ్రయినేజీ నీరు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, పూర్తిగా మహబూబ్‌సాగర్‌ను ఖాళీ చేసి పూడిక తీయాలని సూచించారు. ఆయన వెంట ఇరిగేషన్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ డీఈ ఇంతియాజ్, మత్స్యశాఖ అధికారులు, సంఘం అధ్యక్షులు ఎం.నగేష్, ప్రధాన కార్యదర్శి కూన చిదంబరం సాయి, నాయకులు కూన సంతోష్ వెంకట్ రాజు, నరసింహా రాజు, వంశీ, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జ్వరంతో బాధపడుతున్న వారికి చికిత్స అందజేయాలి..

**- హెల్త్ క్యాంపును సక్రమంగా నిర్వహించి రోగులకు మందులు ఇవ్వాలి..**

**- జిల్లా మలేరియా అధికారి తూకరం రాథోడ్..**

డిచ్ పల్లి: జ్వరంతో బాధపడుతున్న వారికి వేంటనే చికిత్స అందజేయాలని, ఈ హెల్త్ క్యాంపును సక్రమంగా నిర్వహించి రోగులం దరికీ చికిత్స చేసి అవసరాల మేరకు మందులను అందజే యాలని జిల్లా మలేరియా అధికారి తూకరం రాథోడ్ అన్నారు. శుక్రవారం ఇందల్ వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చాంద్రా యన్ పల్లి అరోగ్య ఉపకేంద్రం లోని రూప్లా నాయక్ తండ ను జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ ఆకస్మికంగా సందర్శిం చారు. రూప్లా నాయక్ తండాలో జ్వరంతో బాధపడుతున్న వారికి చికిత్సను అందజేశారు. ఈ హెల్త్ క్యాంపును సరిగా నిర్వహించి రోగులం దరికీ మందులు అందజేయాలని ఇందల్ వాయి వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ కు అదేశించారు. అనంతరం గ్రామంలోని ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమల వలన కలిగే వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా లాంటి వ్యాధులు రాకుండా



తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. తండాలో ఇంటింటికి తిరిగి ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పూల కుండీలలో, పాత టైర్లలో ,రోలు, లాంటి ప్రదేశాలలో నీటి నిలువలను తొలగించుకోవాలని సూచించారు. నీటి నిల్వగల ప్రదేశాలను గుర్తించి గ్రామ కార్యదర్శికి నివేదిక పంపాలని ఆరోగ్య కార్యకర్తలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి వై. శంకర్ ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, ఆరోగ్య కార్యకర్తలు సావిత్రి ,ఉదయ, ఆనంద్ ఆశా కార్యకర్తలు అనిత, రేనా పాల్గొన్నారు.

# డ్రై డే.. ఫ్రైడే ప్రోగ్రాంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ పర్యటన

కంఠేశ్వర్ : నిజామాబాద్ నగరంలోని అర్సపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఇంటిలో మంచినీరు పాత్రలలో నిల్వ ఉంచరాదు అని తెలియజేశారు. డెంగ్యూ వచ్చిన వారి ఇంటిని పరిసరాలను సందర్శించారు. ఆ ప్రాంతంలో జ్వర సర్వే చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ సామ్రాట్ యాదవ్, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిజామాబాద్ నగరపాలక సంస్థ కమిషనర్ మకరందు నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. నాందేవ్ వాడ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చుడాలన్నారు. అదేవిధంగా సారంగాపూర్ లో పరిశీలించారు.



# ఎస్ఎఫ్ఐ సంక్షేమ హాస్టళ్ల సమరభేరి మోటార్ సైకిల్ యాత్ర ప్రారంభం

**- పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను ప్రభుత్వం పెంచాలి**

**- యాత్రను ప్రారంభించిన మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు**

కంఠేశ్వర్ : పెరిగిన ధరలకు అనుగుణంగా మిస్ చార్జీలను ప్రభుత్వం పెంచాలని మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు తెలిపారు. ఏ మేరకు శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జిజీ కళాశాలలోని ఎస్టి గర్ల్స్ హాస్టల్ నుండి యాత్రను మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు గారు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను కాంగ్రెస్ ప్రభుత్వం పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జి జి కళాశాల అభివృద్ధికి 200 కోట్ల రూపాయలను కేటాయించాలని అన్నారు. కానీ రాజకీయ నాయకులు జి.జి కళాశాలను రాజకీయాల మీటింగ్లకు వాడుకుంటున్న అభివృద్ధి చేయడంలో చిత్తశుద్ధి లేదని అవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్ మాట్లాడుతూ.. ఈ యాత్ర ముఖ్య ఉద్దేశం ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని విద్యార్థినిలకు హెల్త్ కిట్స్ అందించాలని అన్నారు. అదేవిధంగా అద్దె భవనాలలో ఉన్న హాస్టళ్లకు పక్కా భవనాలను నిర్మించాలని హాస్టళ్లకు ఇన్చార్జీలు గా ఉన్న వార్డెన్లకు పర్మినెంట్ వార్డలను నియమించాలని ఈ యాత్ర కొనసాగుతుందని అని అన్నారు.




అదేవిధంగా సకలం లో స్కాలర్షిప్లను ఫీజు రియంబర్స్మెంట్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో అధిక నిధులను కేటాయించాలని నాణ్యత కలిగిన భోజనాన్ని అందించే కృషి చేయాలని అన్నారు. దుబ్బా పాఠశాలలో గేమ్స్ ఎక్విప్మెంట్స్ ని అందించాలన్నారు. సర్వేలో వచ్చిన సమస్యల పైన ఈ నెల 27న జిల్లా కలెక్టరేట్ ముట్టడి ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు దీపిక, జిల్లా నాయకులు దినేష్, రాజు, వినీత్, నగర ఉపాధ్యక్షులు కార్తీక్, జిషాన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినుల భద్రతకు అధిక ప్రాధాన్యం: ఎస్పీ అఖిల్ మహాజన్

**- పాఠశాలల్లో విద్యార్థులకు "పోక్సో పై చైతన్యం**

సిరిసిల్ల: విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్లపై అవగాహన కల్పించడం వలన బ్యాడ్ టచ్ సంఘటనలూ ఎదురైనప్పుడు వారు స్వేచ్ఛగా తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు, పోలీసులకు చెప్పగలుగుతారనే ఉద్దేశ్యంతో జిల్లాలో అన్ని పాఠశాలల్లో "పోక్సో పై చైతన్యం" పేరుతో విద్యార్థిని విద్యార్థులకి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. సిరిసిల్లలోని వెంకంపెట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన "పోక్సో పై చైతన్యం"అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై బాల బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ,ఫోక్సో చట్టం గురించి,పోక్సో చట్టం ప్రకారం అమలులో ఉన్న శిక్షల గురించి,సోషల్ మీడియా,సైబర్ క్రైమ్ ల వలన కలుగు అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..జిల్లా పోలీస్ శాఖ విద్యార్థినుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, విద్యార్థులు జీవితంలో చక్కటి లక్ష్యాలను ఎన్నుకుని సరైన మార్గంలో శ్రమిస్తూ ఉన్నత శిఖరాలను చేరుకోలే తప్ప అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ తమ బంగారు భవిష్యత్తు ను నాశనం చేసుకోవద్దన్నరు. జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పోక్సో యాక్ట్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై అవగాహన పరచడానికి "పోక్సో పై చైతన్యం" పేరుతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మైనర్ బాలికలు, చిన్నారుల పట్ల నేరాలకు పాల్పడే వారికి పోక్సో చట్టం ప్రకారం జీవిత ఖైదు వంటి కఠిన శిక్షలు పడే అవకాశం ఉందని, తద్వారా తమ విలువైన జీవితం అంతా జైల్లోనే మగ్గిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చిన్నారుల పట్ల నేరాలకు పాల్పడే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ విడిచిపెట్టబోమని హెచ్చరించారు. మహిళలను గౌరవించడం, వారికి అండగా నిలబడడం వంటివి అలవర్చుకోవాలని సూచించారు. చిన్నారులు తమకు ఇంట్లో, పాఠశాలలో, వీధుల్లో పొరుగువారితో ఎదురయ్యే రకరకాల వేధింపులు, అసభ్య ప్రవర్తన,గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ల గురించి నిర్భయంగా తమ తల్లిదండ్రులకు తెలియజేయాలని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాల అయినా ఫేస్బుక్, వాట్సప్, ఇన్స్టాగ్రామ్ వంటి వాటిని వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. విద్యార్థినిలు మహిళలు మౌనం విడి ముందుకు వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని, నిర్భయంగా ముందుకు వచ్చి మీ సమస్యలను చెప్పుకున్నాప్పుడే మరింత భద్రత కల్పించగలువుతామని, మహిళలు, విద్యార్థినిలు జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 కు పిర్యాదు చేసినచో వారి మీద చట్టపరమైన చర్యాలు తీసుకోవడం జరుగుతుంది అని అన్నారు. పిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణ,జిల్లా సంక్షేమ అధికారి పి లక్ష్మీరాజాం, సిడబ్ల్యుసి చైర్పర్సన్ అంజయ్య,రోజా ఐసిపిఎస్ సిబ్బంది సఖి సిబ్బంది,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్ నేతల ఎదురుచూపులు

కరీంనగర్: తొలి విడత జరిగిన నామినేటెడ్ పదవుల పందేరంలో కరీంనగర్ జిల్లాకు మహిళా కమిషన్ చైర్ పర్సన్, సుడా చైర్మన్ పదవులు దక్కగా.. రానున్న నియామకాల్లో జిల్లా నుంచి మరికొందరికి రాష్ట్ర, జిల్లా స్థాయి పదవుల్లో ప్రాధాన్యత దక్కడం ఖాయమంటూ నేతలు ఆశల పల్లకిలో ఊరేగుతున్నారు. జిల్లా నేతలందరు మంత్రి పొన్నం ప్రభాకర్ పై భారం వేసి తమ అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు.దశాబ్దకాలంపాటు ప్రతిపక్షంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ వచ్చిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇప్పుడు పార్టీ అధికారంలోకి రావడంతో కొత్త ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీ నేతలకు అధిక ప్రాధాన్యతనిచ్చిన నేపథ్యాన్ని గుర్తు చేస్తూ తమకు తగిన గుర్తింపు ఇవ్వాలనే డిమాండ్ బలంగా వ్యక్తమవుతోంది.పార్టీ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు ముగిసినా పదవుల భర్తీ గురించి జిల్లా స్థాయిలో కసరత్తు వేగవంతం కాకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. మానకొండూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను ప్రకటించడంలో స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరవ చూపిన నేపథ్యంలో తమ సంగతేంటేమిటంటూ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తలు మంత్రి పొన్నం ప్రభాకర్ వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.జిల్లా స్థాయిలో శాతవాహన అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ పదవి ఒక్కటి మాత్రమే నియామకం కాగా.. సుడా డైరెక్టర్ల పదవులతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ, వ్యవసాయ మార్కెట్ కమిటీ, దేవాలయాల కమిటీలకు పాలకవర్గాలను నియమించాల్సి ఉంది. చొప్పదండి, మానకొండూరు నియోజకవర్గాల పరిధిలో స్థానిక ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, హుజురాబాద్ పరిధిలో నియోజకవర్గ ఇన్ చార్జి వొడితెల ప్రణవ్ బాధ్యతలు తీసుకుంటుండగా.. ప్రధానమైన కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోనే గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.మొదటి నుంచి ఇక్కడ గట్టి పట్టు ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ ఇక్కడ జరిగే నియామకాలపై దృష్టి సారించాలంటూ కార్యకర్తలు కోరుతున్నారు. ఎటువంటి లాబీయింగ్ చేయకపోతే పదవులు దక్కడం కూడా గగనమేననే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది.నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సుదీర్ఘకాలంగా పార్టీకి సేవలందిస్తున్న తమకే అవకాశం ఇవ్వాలంటూ సీనియర్లు.. పార్టీకి సేవ చేసేందుకు వచ్చిన తమను గుర్తించాలంటూ ఇటీవల ఇతర పార్టీల నుంచి చేరిన వారు పార్టీ నాయకత్వానికి సూచిస్తున్నారు.తాజాగా పార్టీలో చేరి చేరిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి కేబినెట్ హె?దాలో ప్రభుత్వ సలహాదారు నియామకం.. ఆయన కుమారుడు అమిత్ రెడ్డికి డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ పదవిని కట్టబెట్టడాన్ని తాజాగా పార్టీలో చేరిన వారు గుర్తు చేస్తున్నారు. పార్టీ ఆహ్వానం మేరకే తాము చేరినందున తమకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం సరికాదంటూ వారు కూడా పదవులకు పోటీపడుతుండటంతో నామినేటెడ్ పదవులు ఎవరికి దక్కుతాయోన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. పలువురు మహిళా నాయకురాళ్ళు కూడా నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు.కరీంనగర్ లోక్ సభ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి పురుమల్ల శ్రీనివాస్ ఇద్దరు ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన వారే కావడంతో పార్టీకి సేవలందించిన వారెవరో కూడా పూర్తి స్థాయిలో అవగాహన ఉండదని కార్యకర్తలు గుర్తు చేస్తున్నారు. పైగా ఇటు అసెంబ్లీ, అటు లోక్ సభ ఎన్నికల్లో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ గట్టిపోటీనివ్వలేక పోవడాన్ని వారు గుర్తు చేస్తున్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ డిపాజిట్ దక్కించుకొని మూడవ స్థానంలో ఉండగా.. లోక్ సభ ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. మూడు దశాబ్దాలుగా కరీంనగర్ కేంద్రంగా పొన్నం ప్రభాకర్ కార్యకలాపాలు కొనసాగిన నేపథ్యంలో పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల్లో పార్టీ కోసం శ్రమించిన వారికి అవకాశం కల్పించాలంటూ వారు సూచిస్తున్నారు.నియోజకవర్గ అసెంబ్లీ, లోక్ సభ ఇన్ చార్జిలు తమకు సన్నిహితంగా ఉన్న వారికి ప్రాధాన్యతనిస్తే పార్టీ కోసం దశాబ్దాలుగా సేవలందిస్తూ వస్తున్న తమ సంగతి ఏమిటంటూ మరికొందరు సీనియర్ కార్యకర్తలు కలవరపడుతున్నారు. పార్టీ పదవులకు సైతం డిమాండ్ ..త్వరలోనే జిల్లా అధ్యక్ష పదవి మార్పు తప్పనిసరి కావడంతో పార్టీ పదవుల కసరత్తు కొనసాగే అవకాశం ఉంది. అలాగే నగర పార్టీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి సుడా చైర్మన్ గా అవకాశం దక్కడంతో ఆ స్థానంలో మరొకరిని నియమించాల్సి ఉంది.జిల్లా, నగర అధ్యక్ష పదవులతో పాటు అనుబంధ సంఘాలకు కూడా కొత్త అధ్యక్షులను నియమించనుండటంతో మరికొందరు నేతలు ఆయా పదవులపై ఆశలు పెంచుకుంటున్నారు. కరీంనగర్ లో ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ .. ఎంపీగా బీజేపీ ప్రతినిధులు కొనసాగుతున్న నేపథ్యంలో పార్టీని బలోపేతం చేసి రానున్న మున్సిపల్ ఎన్నికల నాటికి ధీటైన స్థితిలో నిలబెట్టాలంటే పార్టీ నాయకత్వం ఇప్పటి నుంచే చొరవ చూపాలంటూ కార్యకర్తలు కోరుతున్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టి సారిస్తే తప్ప కరీంనగర్ లో కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం సంతరించుకోవడం సాధ్యం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది

# బ్యాంకుల ముందు బారులు తీరిన రైతులు




మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలానికి చెందిన రైతులు గత రెండు రోజులుగా పంట పొలాలు వదిలి బ్యాంక్ ల వద్ద బారులు తీరారు. నెల్లికుదురు మండల కేంద్రంలోని ఎస్ బి ఐ బ్యాంక్ వద్ద క్యు లైన్ లో నిలబడి రద్దీని తట్టుకోలేక చెప్పులు పెట్టి తమ వంతును తీర్చుకుంటున్నారు.బ్యాంక్ అధికారులు బ్యాంక్ లోపటికి రానివ్వకపోవడంతో భారీగా క్యు లైన్ పెరిగింది. బ్యాంక్ అధికారులపై ప్రభుత్వంపై రైతులు తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. బ్యాంక్ లోపటికి చేరుకొని అడిగిన రైతులకు ప్రభుత్వం నుండి నీ పేరు రాలేదు మాకు ఏమీ తెల్వదు. నీ అప్పు అలాగే ఉంది. నీకు రుణమాఫీ కాలేదని సమాధానం చెప్పుతుండటంతో రైతులు బాధతో వెనుతిరుగుతున్నారు. కొందరు రైతులకు నీ అప్పు 2 లక్షల కంటే ఎక్కువ ఉన్నది మొదలు ఎక్కువ ఉన్న మొత్తాన్ని చెల్లిస్తే మిగతాది మాఫీ అవుతుంది అని వివిధ రకాలుగా అధికారులు చెప్పడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

గత కాంగ్రెస్ పాలనలో విత్తనాలు ఎరువుల కోసం అనాడు చెప్పులు క్యు లో పెట్టి నిల్చున్న నాటి పరిస్థితులు మళ్ళీ దాపురించాయి అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇకనైన ఇచ్చిన మాట ప్రకారం అందరి రైతులకు రుణమాఫీ ఏకకాలంలో చేయాలని డిమాండ్ చేశారు.

# టెర్రస్ గార్డెన్ లో 800 రకాల మొక్కలు

మెదక్: ఆరోగ్యకర జీవితానికి ఆరోగ్యకర ఆహారం అత్యవసరం. కానీ ప్రస్తుత కాలంలో నిత్యం ఉపయోగించే ఆహార పదార్థాలు, కూరగాయలు,పండ్లు మొదలగు వాటిపై రసాయనాల వాడకం విపరీతంగా పెరిగింది. వీటిని తినడం వలన ప్రజలు అనేక అనారోగ్యాలా బారిన పడుతున్నారు.రసాయనాల వాడకం పెరుగుతున్న నేపథ్యంలో సేంద్రియ ఇంటి పంటలు, లేదా టెర్రస్ గార్డెనింగ్ (మిద్దె తోటల సాగు ) వైపు మొగ్గు చూపే వారి సంఖ్య పెరిగిపోతుంది. ఈ క్రిమి సంహారక మందుల వలన కలిగే దుష్ప్రభావాలను గమనించిన ఓ డాక్టర్ దంపతులు తమకున్న ఇంటి పైకప్పుపై సేంద్రియ పద్ధతిలో ఎటువంటి రసాయనాలు ఉపయోగించకుండా మిద్దె సాగు చేస్తూ రకరకాల కూరగాయలు, పండ్లు పండిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు .సుమారు 700 ల నుండి 800 ల వరకు మొక్కలను మిద్దేసాగుతో ఎంతమందికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు ఈ డాక్టర్ దంపతులు.సిద్దిపేటలోని అభిరామ్ డెంటల్ ఆసుపత్రి నడుపుతున్న ప్రసిద్ధ దంత వైద్యుడు డాక్టర్ డివిఎన్. స్వామి, అతని భార్య డాక్టర్ శ్రీదేవి సిద్దిపేటలోని కంచర బజార్ లో నివసిస్తున్నారు. దంత వైద్యుడిగా సేవలందిస్తూనే, భార్య సహకారంతో 2,000 చదరపు అడుగుల ఇంటి టెర్రస్ పై ఎనిమిది సంవత్సరాల క్రితం సొంతంగా మిద్దె తోటను పెంచడం ప్రారంభించారు డాక్టర్ స్వామి.ఈ దంపతులు ఆకుకూరలతో పాటు 15 రకాల కూరగాయల మొక్కలు, 10 రకాల పండ్ల మొక్కలు, 15 రకాల హెర్బల్ మొక్కలతో కలిపి మొత్తం 800 ల రకాల మొక్కలను మిద్దె తోటలో పెంచుతున్నారు.ఎలాంటి రసాయనాలు ఉపయోగించకుండా సేంద్రియ పద్ధతిలో వారు పండించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఇంటి అవసరాలకు సరిపోవడంతో పాటు, ఇంకా మిగులు దిగుబడి వస్తుండటంతో తమ స్నేహితులు, బంధువులతో కూడా ప్రతిరోజు పంచుకుంటున్నారు.ఈ డాక్టర్ దంపతుల టెర్రస్ గార్డెన్ చాల మందికి స్ఫూర్తినిచ్చింది. ఇప్పుడు వీరితో పాటు, చుట్టుపక్కల 10 మందికి పైగా డాబాలపై ఇలాంటి తోటలను విజయ వంతంగా పెంచుతున్నారు. ఇంకా చాలా మంది మిద్దె తోటను ప్రారంభించడానికి సిద్ధమవుతున్నారు.డాక్టర్ స్వామి మాట్లాడుతూ మార్కెట్ లో విక్రయిస్తున్న పురుగు మందులు కలిపిన పండ్లు, కూరగాయల వల్ల కలిగే దుష్పరిణామాలను గుర్తించి సొంతంగా కూరగాయలు, పండ్లు పండించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇప్పుడు తమ తోట నుండి ఎక్కువ మొత్తంలో పంటను పండిస్తున్నామన్నారు.వీరి గార్డెన్ ను చూసిన స్నేహితులు, ఇరుగు పొరుగు వారు చాలా మంది ఈ మిద్దె తోటను పెంచడానికి ఆసక్తిని కనబరుస్తున్నారు. అలాంటి వారి కోసం సిద్దిపేట పట్టణంలో ఒక వాట్సాప్ గ్రూప్ ను ఏర్పరుచుకొని, దాని ద్వారా కొత్తగా మిద్దె తోటలు పెంచేవారి సందేహాలను నివృత్తి చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఒత్తిడి తగ్గుతుంది?

ఈ తోటలో పని చేయడం ఒత్తిడి తగ్గించుకునేందుకు ఉపయోగపడుతుందని డాక్టర్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం ఈ తోటలో ఎక్కువసేపు గడుపుతామని, అక్కడ తమకు తాజా ఆక్సిజన్ లభిస్తుందని ఈ దంపతులు చెప్పారు. సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు, పండ్లు తినడం వలన ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుందన్నారు.

# 6న ఓటరు లిస్ట్ ల ప్రకటన

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీలు, పంచాయతీల్లోని వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాచరణ మొదలు పెట్టింది. ఈ ఏడాది జనవరి 31వ తేదీ నాటికే పంచాయతీల పదవీ కాలం ముగిసింది. గత ఏడాది డిసెంబరులోనే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కేవలం రెండు నెలల తేడాతోనే ఎన్నికల నిర్వహణకు పోలేకపోయింది. ముఖ్యంగా మార్చిలోనే లోక్ సభ ఎన్నికల హడావిడి మొదలు కావడంతో పంచాయతీ ఎన్నికల విషయాన్ని తాత్కాలికంగా పక్కన పెట్టి, గ్రామాల పాలనను స్పెషల్ అధికారుల చేతుల్లో పెట్టింది.2019లో తెలంగాణలోని 12, 769 గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో జనవరి 21, 25, 30 తేదీల్లో ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత అప్పటి బీఆరఎస్ ప్రభుత్వం మరో 224 కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. ఇవన్నీ కలిపి ఇపుడు 12,993 గ్రామ పంచాయతీలు అయ్యాయి. వీటి ఎన్నికల కోసం కులగణన అంశం కీలకంగా మారింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కుల గణను ముఖ్యంగా బీసీకుల గణను చేపడతామని హామీ ఇచ్చింది. రెండు రోజుల కిందటే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం కుల గణన చేపట్టాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు. దీంతో ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే అంశంపై సందిగ్ధం నెలకొంది. కానీ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మాత్రం తమ పని తాము చేసుకుపోతోంది.అసెంబ్లీ నియోజకవర్గాల ఓటరు లిస్టుల ఆధారంగా రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలలో వార్డుల వారీ, గ్రామ పంచాయతీల వారీగా ఓటరు లిస్టుల తయారు చేయించడం, వాటిని ప్రచురించం కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం వచ్చే నెల (సెప్టెంబరు) 6వ తేదీన వార్డు వారీ, గ్రామ పంచాయతీల వారీగా డ్రాఫ్ట్ ఓటరు లిస్టులు ఆయా జిల్లాల్లోని మండల అభివృద్ధి అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు తయారు చేసి గ్రామ పంచాయతీలలో ప్రకటించాలని నిర్ణయించారు. ఆ డ్రాఫ్ట్ ఓటరు లిస్టులపై జిల్లా కలెక్టర్లు, మండల అభివృద్ధి అధికారులు వచ్చే నెల 9, 10వ తేదీల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా స్థాయి, మండల స్థాయి సమావేశాలు జరిపి వారి నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తారు.డ్రాఫ్ట్ ఓటరు లిస్టులపై సంబంధిత జిల్లా పంచాయతీ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు అభ్యంతరాలు ఉంటే స్వీకరించి వాటిని వచ్చే నెల 19వ తేదీలోగా పరిష్కరించి 21వ తేదీ నాడు వార్డుల వారీ, గ్రామ పంచాయతీల వారీగా తుది ఓటరు జాబితాలను సంబంధిత గ్రామ పంచాయతీ, మండల పరిషత్ లలో ప్రచురించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డ్ సభ్యుల పదవులకు జరగవలసిన 2వ సాధారణ ఎన్నికలలో భాగంగా వార్డు వారీ, గ్రామపంచాయతీల వారీగా ఓటరు లిస్టుల తయారీ షెడ్యూల్ ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి. పార్థసారధి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన సంబంధిత పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నత అధికారులు, ఎలక్షన్ కమిషన్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు.

# అప్పటి ఫైరే... ఇప్పుడు మైనస్

హైదరాబాద్: తెలంగాణలో గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో మొదలైన ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం ఇప్పటికీ కొనసాగుతోంది. ఎన్నికల సమయంలో గెలుపు కోసం నాటి అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పరంపర సాగింది. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో సీఎంగా ప్రమాణం చేసిన రేవంత్‌రెడ్డి.. ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై దూకుడు పెంచారు. మరోవైపు బీఆర్ఎస్ అధికారం కోల్పోయినా? తాము ఎక్కడా తగ్గేది లేదు అన్నట్లు వ్యవహరిస్తోంది. దీంతో అధికార కాంగ్రెస్‌తో ప్రతిపక్ష బీఆర్ఎస్ ఢీ అంటే ఢీ అన్నట్లుగా దూకుడు ప్రదర్శిస్తోంది. ఆరు గ్యారంటీలు, పంట రుణాలు, రైతులకు బోనస్, పంట రుణాల మాఫీ, తాజాగా హైడ్రా కూల్చివేతలపై వరుసగా రగడ జరుగుతోంది. ఇక లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రచార బాధ్యతను భుజానికి ఎత్తుకున సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికల్లో బీజేపీ లక్ష్యంగానే ప్రచారం చేశారు. దీంతో రెండు జాతీయ పార్టీలు కలిసి బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా దక్కకుండా చేశాయి. ఈ క్రమంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో సీఎం రేవంత్ రెడ్డి బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ఎత్తివేస్తుందని ప్రచారం చేశారు. దీనిపై బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లు కోర్టులో పరువు నష్టం కేసు వేశారు. ఈ క్రమంలో నాంపల్లి కోర్టు సీఎం రేవంత్‌రెడ్డికి నోటీసులు ఇచ్చింది.లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కొత్తగూడెంలో సభలో బీజేపీపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ మళ్లీ గెలిస్తే రిజర్వేషన్లను తొలగిస్తుందని రేవంత్ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పరువు నష్టం కేసు వేశారు. కింది కోర్టు పలుమార్లు కేసును వాయిదా వేయడంతో హైకోర్టుకు వెళ్లారు కాసం. హైకోర్టు ఆదేశాలతో రేవంత్ వ్యాఖ్యలపై నాంపల్లి కోర్టు నోటీసులు ఇచ్చింది.లోకసభ ఎన్నికల్లో బీజేపీపై సంచలన వ్యాఖ్యలు చేశారు సీఎం రేవంత్ రెడ్డి. దేశంలో రిజర్వేషన్లు రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందని అన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చబోతున్నారని అన్నారు. 100 ఏళ్లలో భారత్ ను హిందూ రాజ్యాంగ మార్చాలని 1925లో ఆర్ఎస్ఎస్ ప్రతిజ్ఞ చేసిందని పేర్కొన్నారు. ఆ కుట్రలో భాగంగానే 2025లో భారత దేశాన్ని పూర్తిగా హిందూ దేశంగా మార్చబోతున్నారని అన్నారు. అందుకే 2/3 మెజారిటీ కావాలని బీజేపీ నేతలు అడుగుతున్నారని తెలిపారు. బీసీలు, ఓబీసీలపై సర్జికల్ స్ట్రైక్ చేస్తున్నారని.. రిజర్వేషన్లను రద్దు చేయమని బీజేపీ ఎందుకు చెప్పడం లేదని సీఎం రేవంత్ ప్రశ్నించారు. ఈ కుట్రను తిప్పి కొట్టేందుకే కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందని వ్యాఖ్యానించారు.గతంలో కేసీఆర్ సీఎం పదవిలో ఉన్నప్పుడు భారత రాజ్యాంగాన్ని మార్చలని ఆయన అన్నారని గుర్తుచేశారు సీఎం రేవంత్ రెడ్డి. అంటే బీజేపీ విధానంలో భాగంగానే ఆ మాట అన్నారా? అని నిలదీశారు. రిజర్వేషన్లపై కేసీఆర్ విధానాన్ని ప్రకటించాలి అని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ విధానం ఏంటో కేసీఆర్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. లోక్ సభ ఎన్నికల్లో 5 పార్లమెంట్ స్థానాలను కేసీఆర్ బీజేపీకి తాకట్టు పెట్టారని సంచలన ఆరోపణలు చేశారు. ఈటలకు వ్యతిరేకంగా కేసీఆర్ ఎక్కడా మాట్లాడలేదని పేర్కొన్నారు. రేవంత్ ప్రచారం చేసిన వ్యాఖ్యలపై బీజేపీ కోర్టును ఆశ్రయించగా.. తాజాగా నోటీసులు జారీ చేసింది.

# చిక్కుల్లో గులాబీ నేతలు

కరీంనగర్: కేసీఆర్ ప్రభుత్వంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ చేస్తోంది. ఈ వ్యవహారంలో తీగ లాగితే డొంక కదులుతోంది. ప్రాజెక్టు మొదలుపెట్టిన నుంచి జరిగిన తతంగాన్ని పూసగుచ్చి మరీ బయటపెట్టారు మాజీ ఈఎన్సీ నరేందర్‌రెడ్డి.నాలుగేళ్లు బ్యారేజీలను అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని కమిషన్ ముందు వెల్లడించారాయన. అలా వదిలేయడం వల్లే వైఫల్యం చెందాయని చెప్పుకొచ్చారు. గేట్లు ఎత్తడంలో మాన్యువల్‌ను పాటించ లేదని తెలిపారు. బ్యారేజ్ నిర్మాణంలో సున్నితమైన పనులను ఫ్లడ్ లైట్స్ వెలుగులో చేశారని వివరించారు. అంతేకాదు కాంక్రీట్ ను అపరిమిత వేగంతో నింపారన్నది ఆయన చెబుతున్న మాట. ముఖ్యం గా టెండర్ల ఖరారు, బ్యారేజీల వైఫల్యంలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ లోపాలు ప్రధానంగా కారణమని తేలినా ఈఎన్సీ పదవీకాలం పొడిగించారని తెలిపారు.మేడిగడ్డ బ్యారేజ్ డిజైన్లను సీడీవో ఒక్కరే తయారు చేయలేదని మాజీ ఈఎన్సీ నరేందర్‌రెడ్డి వెల్లడించారు. సీడీవోతో కలిసి ఎల్ అండ్ టీ తయారు చేసిందన్నారు. నిర్మాణానికి ముందు బ్యారేజీల ప్రదేశాలను పరిశీలించామని, నిర్మాణం ప్రారంభమైన తర్వాత వెళ్లలేదన్నారు. మేడిగడ్డ నిర్మాణం, నాణ్యతలో తీవ్ర లోపాలు జరిగాయని వెల్లడించారు.వర్షాకాలంలో ముందు వెనుక చేపట్టాల్సిన పనులను చేయలేదన్నారు మాజీ ఈఎన్సీ. నిర్మాణ సమయంలో తనిఖీలు లేవని స్పష్టంచేశారాయన. ఈ ప్రాజెక్టును డిజైన్ చేసిందెవరని ప్రశ్నించగా.. సెంట్రల్ డిజైన్ రూపొందించిందని, ఇందులో ఎల్ అండ్ టీ ఇంజినీర్లు కూడా ఉన్నారని నరేందర్ రెడ్డి వివరించారు. డిజైన్‌లో ఎలాంటి లోపాలు లేవని స్పష్టం చేసిన నరేందర్ రెడ్డి.. మెయింటెనెన్స్ లోపాల వల్లే కాళేశ్వరం ప్రాజెక్టుకు డ్యామేజీ జరిగిందని చెప్పారు.ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన ఎలాంటి చర్చలకు తనను పిలువలేదని, తాను ఎక్కడా చర్చల్లో పాల్గొనలేదని స్పష్టం చేశారు. తాను కన్‌స్ట్రక్షన్ జరిగిన ప్రాంతానికి వెళ్లలేదని వివరించారు. కన్‌స్ట్రక్షన్ తన పరిధిలోనిదే కాదని చెప్పారు. లొకేషన్స్ ఆధారంగా డిజైన్స్, డ్రాయింగ్ తయారు చేశామని తెలిపారు.2023లో మేడిగడ్డ ఏడో బ్లాక్ కుంగిన తర్వాత వెళ్లి పరిశీలించానన్నారు. సీడబ్ల్యూసీకి పంపిన తర్వాత కూడా డిజైన్‌లలో కొన్ని మార్పులు చేర్పులు జరిగాయని నరేందర్ రెడ్డి తెలిపారు. బ్యారేజీల నిర్వహణ సరిగా లేదని చెప్పిన ఆయన మేడిగడ్డ ఘటన తర్వాత కూడా సరిదిద్దే అవకాశం ఉందని చెప్పారు. తగిన రీతిలో సత్వరమే స్పందించలేదన్నారు.నిర్మాణ సంస్థ, ఇంజనీర్లు పట్టించుకోలేదని, వైఫల్యానికి కారణమైన వారికే మళ్లీ బాధ్యతలు అప్పగించారని కమిషన్ ముందు వెల్లడించారు.మాజీ ఇంజనీర్లు ఇచ్చిన ఆధారాల ప్రకారం ఆనాటి ప్రభుత్వ పెద్దలను విచారణకు రప్పించాలనే ఆలోచనలో కమిషన్ ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అప్పుడైనా గత ప్రభుత్వం పెద్దలు కమిషన్ ముందుకు వెళ్తారా? లేక సమయం కావాలని తప్పించుకుంటారా? అన్నది చూడాలి.

# బస్సు ఓవర్ లోడ్.. చేతుల్లేత్తేసిన డ్రైవర్

హుజూరాబాద్: రాష్ట్రం లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ విపరీతం గా పెరిగింది.ఒక్క బస్సులో 55 మంది కేపాసిటి ఉంటే 110 మంది ప్రయాణికులు ఎక్కుతుండడం తో నేను ఓవర్ లోడ్ తో వెళ్ళలేనని సైడ్ మిర్రర్ కనపడడం లేదని నడి రోడ్డు పై బస్సు ఆపి తన ఆవేదన వ్యక్తం చేశాడో ఆర్టీసీ డ్రైవర్.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ బస్ స్టాండ్ లో సిరిసిల్ల డిపో కు చెందిన ఆర్టీసీ బస్సు వరంగల్ కు వెళుతుండగా హుజూరాబాద్ బస్ స్టాండ్ కు చేరుకుంది.అప్పటికే ప్రయాణికులతో నిండి ఉన్న బస్సు హుజూరాబాద్ లో చాలా సేపటి నుండి బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణీకులు బస్సులో స్థలం లేకున్నా ఎక్కేశారు బస్సు కేపాసిటీ కి మించి నూట పది మంది ఎక్కడం తో బస్ స్టాండ్ నుండి బస్సు తీసుకొని బయటికి వెళ్ళిన డ్రైవర్ కు సైడ్ మిర్రర్ కనపడక నడిపే పరిస్థితి లేక నడి రోడ్డు పై బస్సును ఆపేశాడు.సైడ్ మిర్రర్ కనపడక ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని దయచేసి కొంత మంది దిగాలని ప్రయాణికులను కోరగా కొంతమంది దిగడం తో బస్సును యదావిధిగా వరంగల్ తీసుకెళ్ళాడు.

# గాలి వల్ల మంకీ ఫాక్స్ వ్యాపించదు

## గాంధీ వైద్యులు

సికింద్రాబాద్: మంకీ ఫాక్స్ గాలిలో వ్యాప్తి చెందదు. కేవలం ఆ రుగ్మత కలిగిన వారిని తాకిన వారికి మాత్రమే సోకే అవకాశం ఉంటుందని గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. రాజకుమారి తెలిపారు.

ప్రపంచ వ్యాప్తంగా మంకీ ఫాక్స్ (ఎం ఫాక్స్) అలజడి సృష్టిస్తున్న నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. అందులో భాగంగా గాంధీ ఆసుపత్రిలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 10పురుషులకు, 10మహిళలకు చొప్పున మొత్తం 20పడకలను కేటాయించారు. ఈ సందర్భంగా డా. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆదేశాల మేరకు మంకీ ఫాక్స్ బాధితులకు వైద్యం అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మంకీ ఫాక్స్ లక్షణాలతో వచ్చిన వారిని సాధారణ రోగులతో కలువనీయకుండా డైరెక్టుగా సంబంధిత వార్డుల వద్దకే వచ్చే విధంగా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. చికిత్సకు అవసరమైన మందులను, ఆంటీ వైరల్ డ్రగ్స్ సేకరించడానికి ఆదేశించామని అన్నారు. ఇప్పటివరకైతే ఒక్క కేసు కూడా నమోదు కాలేదని వెల్లడించారు. జనరల్ మెడిసిన్ ప్రధానదిపతి డా. సునీల్ మాట్లాడుతూ చికెన్ ఫాక్స్ మాదిరిగానే వీటి లక్షణాలు రాశాస్, నీటి బుడగలు, జ్వరం, వళ్ళు నొప్పులు వస్తాయని తెలిపారు. చికెన్ ఫాక్స్ లో కంటే ఇందులో ఎక్కువగా ర్యాషెస్ నీటి పొక్కులు వస్తాయని పేర్కొన్నారు. ప్రారంభం దశలో గుర్తిస్తే ఇతరులతో కలవనివ్వకుండ ప్రత్యేక గదిలో ఉంచి చికిత్స అందించవచ్చని తెలిపారు. తీవ్రంగా ఉంటే హాస్పిటల్ లో అడ్మిట్ చేసుకొని చికిత్స అందించాల్సిందేనని అన్నారు. మన దగ్గర ఇప్పటి వరకు ఒక కేసు కూడా రాలేదని, యురాఫ్, ఆఫ్రికా దేశాల్లో దీని ప్రభావం ఉందని చెప్పారు. ముఖ్యంగా ఇటీవల అంతర్జాతీయ ప్రయాణ చరిత్ర ఉన్న వారితో దూరంగా ఉండాడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండాలని కోరారు. మంకీ ఫాక్స్ టీకాలు తీసుకున్న వారికి అంత త్వరగా సోకే అవకాశం లేదని రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నారులు, వృద్దులకు, ఇతర రోగ గ్రస్తులకు సోకే అవకాశం ఉంటుందని వివరించారు.

# బ్లిట్జ్ మ్యాగజైన్ లో వచ్చిన వార్తపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదు



హైదరాబాద్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడారు. తమ వ్యాపార ప్రయోజనాల కోసం ఉద్దేశపూర్వకంగా కుట్రపూరితంగా ఇన్వెస్టర్లను, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు హిండెన్ బర్గ్ రాసిన వార్తలపై రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి కలిసి చేస్తున్న ఆరోపణలను ఖండిస్తున్నామని అన్నారు. తన తమ్ముళ్లు దందాలు చేస్కోవచ్చు కాని సెబీ చైర్పర్సన్ ఆదాని సంస్థలో షేర్స్ కొనుక్కోవద్దా..? రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి. భారత స్టాక్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) షేర్స్ తీసుకోవడంపై అభ్యంతరం ఎందుకు..? హిండెన్ బర్గ్ సంస్థ రాసిన వార్తలపై సుప్రీంకోర్టు విచారణ జరిపి తీర్పునిచ్చింది. హిండెన్ బర్గ్ ఆరోపణలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఆర్థిక లావాదేవీలకు సంబంధించి హిండెన్ బర్గ్ రాసిన వార్తల్లో వాస్తవికత లేదని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పిందని గుర్తు చేసారు. దేశంలో సెబీమీద, ఆదానీ మీద, సుప్రీంకోర్టు మీద, భారత ప్రజాస్వామ్యం మీద రాహుల్ గాంధీకి నమ్మకం లేదు. కాని, హిండెన్ బర్గ్ రాసే వార్తలను మాత్రం నమ్ముతారు. విదేశీ జర్నలిస్టులు రాసే వార్తలే నిజమంటూ రాహుల్ భావిస్తున్నారు. ఎన్నికల్లో చావుదెబ్బ తిని అహంకారపూరితంగా దేశంలోని వ్యవస్థల మీద దాడిని రాహుల్ గాంధీ కొనసాగించాలనుకుంటున్నారు. మరి, బ్లిట్జ్ మ్యాగజైన్ లో వచ్చిన వార్తపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదు..? రాహుల్ తోడుగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపణలు చేస్తున్నారు. అదానీని రాష్ట్రం లో పెట్టుబడులు పెట్టాలని రేవంత్ రెడ్డి ఎందుకు ఆహ్వానించినట్టు..? గతంలో తన వ్యాపారాన్ని విస్తరించాలని రాజీవ్ గాంధీ తనను కోరారని అదానీ చెప్పారు. వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకునేలా ఢిల్లీకి ఆహ్వానించారు. హిండెన్ బర్గ్ ను అడ్డం పెట్టుకొని ఏం చేద్దామని అనుకుంటున్నారు. హిండెన్ బర్గ్ కు ఉన్న క్రెడిబిలిటీ ఏంటో రాహుల్ చెప్పాలి. దేశ ప్రజాస్వామ్యంపై దాడి చేయాలని కుట్ర చేస్తున్నవారికి కాంగ్రెస్ నాయకులు భజన చేస్తున్నారు. జార్జ్ సోరెస్ లాంటి వారు వ్యాపార సామ్రాజ్యంలో అడ్డగోలుగా సంపాదించేందుకునేందుకు తప్పుడు వార్తలు రాస్తే.. రాహుల్ గాంధీ లాంటి వారు ధర్నాలు చేస్తున్నారు. సెబీ హిండెన్ బర్గ్ కు నోటీసులు జారీ చేస్తే సమాధానం ఎందుకు చెప్పలేకపోయారు..? రాహుల్ గాంధీ వంటి వారు సెబీని నమ్మరు, అదానీపై నమ్మకం లేదు. కాని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు అదానీతో కలిసి వ్యాపారాలు చేస్తారు. విదేశాల్లో అదానీతో కలిసి తిరుగుతూ, వ్యాపార ఒప్పందాలు చేసుకుంటారు. మళ్లీ భారత్ కు వచ్చిన తర్వాత అదానీపై ఆరోపణలు గుప్పిస్తారని అన్నారు. రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులు భారత షేర్ మార్కెట్ ను దెబ్బ తీయాలని అనుకుంటున్నారా.. భారత ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయాలనుకుంటున్నారా..? హిండెన్ బర్గ్ సంస్థ, జార్జ్ సోరెస్ కలిసి చేస్తున్న కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నాం. రాహుల్ గాంధీ బ్రిటిష్ పౌరుడిని చెప్తూ వివరాలతో సహా కోర్టులో సుబ్రమణ్య స్వామి పిటిషన్ వేశారు. రాహుల్ బ్రిటన్ లో కంపెనీని స్థాపించారని, ఆయన బ్రిటన్ పౌరుడని వివరాలు సమర్పించారు. దీంతో సిటిజన్ షిప్ తీసేస్తారేమోననే ఉద్దేశంతో రాహుల్ తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. షేర్స్ కొని, అమ్ముకునే బ్రోకర్ రాసిన వార్తతో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు గొడవలు సృష్టించాలనుకోవడం సిగ్గుచేటు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో బ్లిట్జ్ పేపర్ పై సీబీఐ విచారణ జరపాలని ముఖ్యమంత్రులతో లేఖలు రాయించగలరా..? అదానీ-హిండెన్ బర్గ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాహుల్ గాంధీ ఇప్పటికైనా గౌరవించాలి. లేదంటే రానున్న రోజుల్లో జవాబుదారీగా నిలబడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నామని అన్నారు.

# మారతారన్ననమ్మకం లేదు...విడిగానే ఉండండన్న సుప్రీం



న్యూఢిల్లీ: పెళ్లి చేసుకున్న కలిసి ఉండకపోతే ఆ వివాహానికి అర్థం ఉండదు. పెళ్లి అయిన తర్వాత రోజే పెళ్లి కూతురు అత్తగారి ఇంటి నుంచి వెళ్లిపోయి... లేనిపోని గొడవలకు దిగితే ఇక ఆ పెళ్లి నరకమే. చివరికి విడాకులకూ అంగీకరించకపోతే.. ఆ భర్త పడే బాధ వర్ణనాతీతం. ఇలాంటి భర్తకు సుప్రీంకోర్టు గుడ్ న్యూస్ చెప్పింది. వెంటనే విడాకులు మంజూరు చేసింది. యూపీలోని మీరట్‌కు చెందిన ఇద్దరు డాక్టర్లకు 22 ఏళ్ల కిందట పెళ్లి అయింది. కానీ భార్యకు అత్తగారింట్లో ఏదో నచ్చలేదు. అందుకే తర్వాత రోజే పుట్టింటికి వెళ్లిపోయారు. అనేక సార్లు పెద్దలు చర్చలు జరిపితే అతి కష్టం మీద 23 రోజులు మాత్రమే కలిసున్నారు. అది కూడా వరుసగా కాదు. రాజీ చేసినప్పుడే ఇలా కలిసి ఉన్నారు.. తర్వాత ఒకటి రెండు రోజులకే ఆ భార్య వెళ్లిపోయేది. ఈ క్రమంలో అనేక వివాదాలు కూడా వచ్చాయి. భార్యభర్తలు ఇద్దరూ పరస్పరం కేసులు కూడా పెట్టుకున్నారు. భార్య గృహహింస కేసు పెట్టడంతో భర్తతో పాటు అతని తల్లిదండ్రులు కూడా జైలుకు వెళ్లివచ్చారు.ఇదంతా ఎందుకని ఆ భర్త విడాకుల కోసం కోర్టుకు వెళ్లాడు. 2006లో మీరట్ కోర్టు విడాకులు మంజూరు చేసింది. అయితే ఆ భార్య మాత్రం నిన్ను వదలని నీడని నేనే అంటూ.. విడాకుల డిక్రీని రద్దు చేయాలని అలహాబాద్ హైకోర్టుకు వెళ్లింది. 2019లో అలహాబాద్ హైకోర్టు .. మీరట్ కోర్టు మంజూరు చేసిన విడాకులను క్యాన్సిల్ చేసింది. దీంతో కాపురానికి రాని భార్య.. విడాకులు కూడా ఇవ్వకుండా వేధిస్తోందని.. ఆ భర్త సుప్రీంకోర్టుకు వెళ్లాడు. సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ ను జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ చంద్రశర్మ బెంచ్ విచారణ జరిపింది. గత ఇరవై రెండేళ్ల కాలంలో మొత్తంగా 23 రోజులు మాత్రమే కలిసున్నారని.. మరో ఇరవై రోజులు కోర్టు ఆదేశాలతో కలిసి ఉన్నట్లుగా చెప్పారని.. ఎలా చూసినా మొత్తంగా 22 ఏళ్ల కాలంలో 43 రోజులు మాత్రమే కలిసి ఉన్నారని ఇక ఈ వివాహానికి అర్థం ఏముందని ధర్మానసం ప్రశ్నించింది. అదే సమయంలో తనకు విడాకులు వద్దని ఇప్పటికైనా కలిసి ఉంటామని ఆ భార్య చెప్పినా ధర్మాసనం అంగీకరించలేదు. ఆమె ఇప్పటి వరకూ ప్రవర్తన ప్రకారం చూస్తే నమ్మశక్యంగా లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. గతంలో దిగువ కోర్టులు ఇలా వారిని కలిపేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని గుర్తు చేశారు. అదే సమయంలో ఇప్పుడు ఇద్దరూ యాభైల్లోకి వచ్చారని ఇప్పుడైనా వారి జీవితాలు వారు స్వతంత్రంగా గడపకోనివ్వాలన్నారు. పెళ్లి చేసుకుంది గొడవ పడటానికే అన్నట్లుగా ఇరవై రెండేళ్ల పాటు లేనిపోని కేసులతో కాలక్షేపం చేసిన ఈ జంటకు విడాకులు మంజూరు చేయడమే కాకుండా.. ఎవరూ ఎవరికీ అలిమోని చెల్లించాల్సిన పనిలేదని స్పష్టం చేసింది.ఇద్దరూ డాక్టర్లుగా పని చేస్తున్నారని జీవించడానికి అవసరమైన ఆదాయం ఉందని స్పష్టం చేశారు.

# నూతన ఆర్వోఆర్ చట్టంపై సూచనలు ఇవ్వండి

ఖమ్మం: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లు పై సలహాలు సూచనలను అందజేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారంజిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో రెవిన్యూ అధికారులు, న్యాయవాదులు, నిపుణులతో నూతన రెవెన్యూ చట్టం-2024 ముసాయిదాపై వర్క్ షాప్ నిర్వహించారు.నూతన రెవెన్యూ చట్టం-2024 ముసాయిదా బిల్లు లో పేర్కొన్న అంశాలు, ఈ బిల్లు తీసుకురావడంలో గల ఉద్దేశ్యాన్ని జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భూ సమస్యల పరిష్కారం కోసం నూతన రెవెన్యూ చట్టం రూపొందించాలని ప్రభుత్వం సంకల్పించిందని, దేశంలో వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమమైన భూ రికార్డుల నిర్వహణను పరిశీలించిన నిపుణుల బృందం నూతన రెవెన్యూ చట్టం- 2024 ముసాయిదా బిల్లును రూపొందించిందని తెలిపారు. నూతన చట్టం రూపకల్పనలో ప్రజలను విస్తృతంగా భాగస్వామ్యం చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు, గురువారం వర్క్ షాప్ నిర్వహించినట్లు ఆయన అన్నారు. భూ రికార్డుల నిర్వహణకు మెరుగ్గా ఉండే విధంగా ముసాయిదా బిల్లుపై రైతు సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు (రిటైర్డ్డ సర్వీస్) తమ సూచనలను అందజేయాలని కలెక్టర్ కోరారు. నూతన రెవెన్యూ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు సూచనలు ఏమైనా ఉంటే వెంటనే రాతపూర్వకంగా కలెక్టరేట్ కార్యాలయానికి అందిస్తే, వాటిని ఒక నివేదిక రూపంలో సిద్ధం చేసి తుది చట్ట రూపకల్పన కోసం సీసీఎల్ఏ కు సమర్పిస్తామని కలెక్టర్ అన్నారు.

వర్క్ షాప్ లో పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగులు, న్యాయవాదులు, రైతు సంఘాల నాయకులు తమ సూచనలు సలహాలు తెలిపారు. గ్రామంలోని ఆబాది భూముల రికార్డులు అప్డేట్ చేయాలని, సాదా బైనమా భూముల రిజిస్ట్రేషన్ రుసుం వసూలు చేయాలని, పోజిషన్ కాలం ఉండాలని, అప్పిలేట్ అథారిటీ ఆర్డిఓ స్థాయిలో ఉండాలని వారు అన్నారు. సమగ్ర భూ సర్వే చేపట్టాలని వారు కోరారు. భూ రిజిస్ట్రేషన్ మార్పులు, సంబంధిత గ్రామంలో ప్రచారం చేయాలని వారు తెలిపారు. వారసత్వ ముటేషన్లు ఉచితంగా చేయాలని, రెవిన్యూ రికార్డులు రెవెన్యూ గ్రామాల వారిగా కాకుండా, గ్రామాల వారిగా చేపట్టాలని అన్నారు. సాదా బైనామా దరఖాస్తులన్నిటిని పరిష్కరించాలని వారు తెలిపారు. నూతన ఆర్వోఆర్ చట్టం అమలు కోసం ప్రతి గ్రామంలో రెవెన్యూ ఉద్యోగి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, భూ సమస్యల అప్పిలేట్ అథారిటీ జిల్లా స్థాయిలోనే ఉండే విధంగా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు జి. గణేష్, ఎల్. రాజేందర్, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లాలోని తహసిల్దార్లు, న్యాయవాదులు, రైతు సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ హోం గార్డ్ దారుణ హత్య

పెద్దపల్లి: మాజీ హోంగార్డు దారుణ హత్యకు గురైన సంఘటన పెద్దపల్లి జిల్లా లో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూరులో గ్రామానికి చెందిన మాజీ హోంగార్డు మాటూరి విజయ్ ని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. భూ వివాదం వల్లే హత్య జరిగి ఉంటుందని గ్రామస్తులు భావిస్తున్నారు. గత కొన్ని రోజులుగా మృతుడు విజయ్ కి భూమి విషయంలో బంధువులతో గొడవ జరుగుతుండేదని మృతుని సోదరుడు తిరుపతి తెలిపారు .సమాచారం అందుకున్న పెద్దపల్లి ఏసిపి కృష్ణ, సిఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్ఐ అశోక్ రెడ్డి లు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# శక్తిదాస్... శక్తి మంతుడే

ముంబై: ప్రపంచంలోని టాప్ సెంట్రల్ బ్యాంకుల్లో భారత దేశపు రిజర్వ్ బ్యాంక్ వరుసగా రెండోసారి "ఏ+" ర్యాంక్ సాధించింది. ఈ టాప్ ప్రపంచంలోని మూడు బ్యాంకులకు మాత్రమే ఈ సంవత్సరం లభించడం విశేషం. అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మెగజీన్ ప్రచురించిన రిపోర్ట్ ప్రకారం.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, డెన్మార్క్ కు చెందిన యూరోపియన్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, స్విట్జార్ ల్యాండ్ కు చెందిన స్విస్ నేషనల్ బ్యాంక్ "ఏ+" ర్యాంక్ సాధించాయి. భారత్ కు ఈ టాప్ ర్యాంక్ రావడం ఇది వరుసగా రెండోసారి. గ్లోబల్ ఫైనాన్స్ మెగజీన్ ప్రచురించిన రిపోర్ట్ లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్ శక్తికాంతా దాస్ తీసుకున్న కీలక నిర్ణయాల వల్లే ఈ టాప్ ర్యాంక్ సాధ్యమైందని ప్రశంసించింది. భారత దేశంలో పెరుగుతున్న ద్రవోల్బణాన్ని అదుపు చేయడం, ఆర్థికంగా దేశం అభివృద్ధి చెందడం, ఇండియన్ కరెన్సీ, వడ్డీ రేట్లు స్థిరంగా ఉండడానికి ఆర్‌బిఐ) గవర్నర్ శక్తికాంతా దాస్ వ్యూహాలు కీలక పాత్ర పోషించాయని రిపోర్ట్ పేర్కొంది.

"ఏ+" ర్యాంక్ సాధించిడానికి నియమాలు ఇవే

గ్లోబల్ ఫైనాన్స్ మేగజీన్ సెంట్రల్ బ్యాంకర్ రిపోర్ట్ కార్డ్స్ నియమాల ప్రకారం.. ప్రతీ దేశ కేంద్ర బ్యాంకుల గవర్నర్లకు "ఏ" నుంచి "ఎఫ్" వరకు ర్యాంక్ కేటాయిస్తారు. ముఖ్యంగా దేశంలో పెరుగుతున్న నిత్యావసరాల ఖర్చులు అదుపుచేయడానికి ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయడం, ఆర్థిక పురోగతి సాధించడానికి కొత్త ఆర్థిక పాలసీలు రూపొందించడం, అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగా కరెన్సీని స్థిరంగా ఉంచడం, వడ్డీ రేట్లు నియంత్రించడం ఈ బాధ్యతలన్నీ విజయవంతంగా నిర్వహించగలగాలి. అయితే ఈ పనులన్నీ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంతా దాస్.. సమర్థవంతంగా నిర్విహించారు. పైగా ఆశించిన స్థాయ కంటే మెరుగైన ఫలితాలు సాధించారు. ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంతా దాస్ ని గ్లోబల్ ఫైనాన్స్ మేగజీన్ ప్రశంసిస్తూ.. గత కొన్ని సంవత్సరాలుగా భారతదేశంలో విపరీతంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు శక్తి కాంతా దాస్ ప్రభావవంతమైన ఆర్థిక పాలసీలు రూపొందించి.. మంచి ఫలితాలు రాబట్టారని తెలిపింది. గ్లోబల్ ఫైనాన్స్ మేగజీన్ 1994 నుంచి ప్రపంచ దేశాల కేంద్ర బ్యాంకుల గవర్నర్లకు ర్యాంకులు కేటాయిస్తూ ప్రతీ సంవత్సరం రిపోర్ట్ జారీ చేస్తోంది. దేశంలో ఆర్థికంగా అద్భుతమైన ఫలితాలు సాధిం చిన బ్యాంకర్లకు గౌరవంగా ఈ రిపోర్ట్ ప్రచురిస్తుంది.అయితే భారత దేశ ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంతా దాస్ తో పాటు యూరోపియన్ ఇన్వెస్ట్ మెంట్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ క్రిస్టియన్ కెట్టెల్ థామ్ సెన్, స్విట్జార్ ల్యాండ్ కు చెందిన స్విస్ నేషనల్ బ్యాంక్ చైర్మెన్ థామస్ జోర్డాన్ ని కూడా టాప్ ర్యాంకులు కేటాయించింది. క్రిస్టియన్ కెట్టెల్ థామ్‌సెన్ డెన్మార్క్ ప్రభుత్వంలో పలుపదువుల బాధ్యతలు నిర్వర్తిస్తు న్నారు.ఆయన డెన్మార్క్ ప్రధాన మంత్రి, ఆర్థిక శాఖకు పర్మనెంట్ సెక్రటరీగా కూడా పనిచేస్తు న్నారు. అలా స్విస్ నేషనల్ బ్యాంక్ చైర్మాన్ థామస్ జోర్డాన్ కూడా ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ లావాదేవీల బ్యాంకులలో పదవులలో ఉన్నారు.

# ఐదోసారి జెన్నీఫర్ లోపేజ్ విడాకులు

న్యూయార్క్: హాలీవుడ్ జంట బెన్ అఫ్లెక్స్-జెన్నీఫర్ లోపేజ్ విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. రెండేళ్ల వివాహ బంధానికి వారు ముగింపు పలకబోతున్నారు. లాస్ ఏంజెల్స్ లోని కౌంటీ న్యాయస్థానంలో వారు విడాకుల దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు జెన్నిఫర్ ఈ పిటిషన్ ను దాఖలు చేసింది. కాగా వీరిద్దరూ లాస్ వెగాస్ లో 2022లో వివాహం చేసుకున్నారు. వీరిద్దరికి 2002 నుంచి పరిచయం ఉంది. తర్వాత 20 ఏండ్లకు వీరు పెండ్లి ద్వారా ఏకమయ్యారు. ఇక జెన్నిఫర్ ఇలా బ్రేకప్ చెప్పడం ఇది ఐదోసారి. బెన్ కు ఇది మూడోసారి. జెన్నిఫర్ గతంలో ఓజానీ, మార్క్ అంథోని, క్రిస్ జూడ్ తో బ్రేకప్ చెప్పింది. ఇక బెన్ తో ఇది రెండోసారి. అయితే ప్రస్తుతం విడాకుల కోసం జెన్నీ కోర్టుకు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. రెండేళ్ల దాంపత్య జీవితానికి జెన్నీ, బెన్ జంట ఇక ముగింపు పలికినట్లేనని అభిమానులు బాధ పడుతున్నారు. కొంతకాలంగా వీరిద్దరి మధ్య సఖ్యత లేదని సన్నిహితులు చెబుతున్నారు. వీరు విడాకులు ఖాయమని ప్రచారం జరిగింది. దీనిని నిజం చేస్తూ జెన్నిఫర్ కోర్టులో విడాకుల పిటిషన్ వేసింది. లాస్ ఏంజిల్స్ కోర్టులో దంపతులిద్దరూ తమ ఆర్థిక సమాచారాన్ని వెల్లడించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆదాయం, ఖర్చులు, ఆస్తులు, రుణాల వివరాలు పూర్తిగా ఇవ్వాల్సి ఉంటుంది. తుది తీర్పు వెల్లడించేలోగా ఈ వివరాలు కోర్టులో సబ్ మిట్ చేయాలి. కాగా భర్త బెన్ నుంచి జెన్ని పెద్ద ఎత్తున భరణం డిమాండ్ చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా, 150 మిలియన్ డాలర్ల ఆస్తిలో సగం వాటా కావాలని జెన్నిఫర్ అడుగుతున్నట్లు ఒక వార్తపత్రిక కథనం ప్రచురించింది. ప్రస్తుతం ఈ జంట బెవర్లీ హిల్స్ లోని ఖరీదైన బంగ్లా లో ఉంటున్నారు. ఇక ఇప్పుడు ఈ భవనాన్ని కూడా విక్రయిస్తున్నట్లు సమాచారం.జెన్నిఫర్ లోపేజ్ ఆస్తి 400 మిలియన్ డాలర్ల పైనే ఉంటుందని సమాచారం. ఇండియా కరెన్సీ ప్రకారం దీని విలువ రూ. 3వేల కోట్ల పైమాటే. అయితే వివాహం అనంతరం జెన్ని ఆస్తి కొంత తగ్గినట్లు తెలుస్తున్నది. గతంలో మార్క్ అంథోనీని వివాహం చేసుకున్న జెన్నీ కవల పిల్లలకు జన్మనిచ్చింది.మొత్తంగా జెన్నీ కోరికకు బెన్ ఒప్పుకుంటే, 900 కోట్లకు పైగా భరణం దక్కుతుంది. అయితే కుర్రకారు కలలరాణి అయిన జెన్నిఫర్ లోపేజ్ విడాకుల అంశం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది.బెన్ అఫ్లెక్స్, జెన్నిఫర్ లోపెజ్ కలిసి రెండు సినిమాల్లో నటించారు. 2003లో వీరిద్దరూ కలిసి రోమాంటిక్ చిత్రం గిగ్లి లో కనువిందు చేశారు. 2004లో కెవిన్ స్మిత్ కామెడీ సినిమా జెర్సీలో జంటగా కనిపించారు. 2002 నుంచి 2004 వరకు ఇద్దరూ డేటింగ్ చేశారు. కాగా, జెన్నీ,బెన్ రెండు సార్లు పెండ్లి చేసుకున్నారు.మొదటగా 2022లో లాస్ వెగాస్ లో మొదటి వివాహం , 2022లో ఆగస్టు లో జార్జియా లో వివాహం చేసుకున్నారు. బెన్ వ్యవహార శైలి వల్లే జెన్నిఫర్ విడాకులు తీసుకోవాలని అనుకుంటున్నట్లు ఆమె సన్నిహితులు చెబుతున్నారు. కలిసి ఉండేందుకు ప్రయత్నించినా. బెన్ మాత్రం తన తీరు మార్చుకోలేదని సమాచారం. ఇక తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఇవ్వాలని మాత్రం ఇద్దరూ ఆలోచిస్తున్నారట.

# ఆ ఒక్క విలేజ్ డిపాజిట్లు 7 వేల కోట్లు

గాంధీనగర్: గ్రామాలు అనగానే.. చాలా వరకు రైతులు, కూలీలు, పేద ప్రజలు గుర్తొస్తారు. కాకపోతే గ్రామీణులు అమాయకంగా ఉంటారు. కళ్లాకపటం తెలియదు. మోసాలు తెలియవు. ప్రపంచంలో అంత్యంత సంపన్న వ్యక్తులు, దేశాలు, నగరాల గురించి మీరు వినే ఉంటారు. మరి సంపన్న గ్రామం గురించి మీరెప్పుడైనా విన్నారా? అవును మీరు విన్నది నిజమే. మనదేశంలోని ఓ రాష్ట్రానికి చెందిన గ్రామం ఆసియాలోని అత్యంత సంపన్న గ్రామంగా అవతరించింది. భారత్‌లో వ్యాపారులు అనగానే గుర్తొచ్చేది గుజరాతీలు. వీరిని మించిన వ్యాపారులు ఎక్కడా లేరన్న అభిప్రాయం ఉంది. వీరు మన దేశంతోపాటు ప్రపంచ వ్యాపారం రంగంలో వీరే అగ్రస్థానంలో ఉంటారు. తాజాగా గుజరాత్ రాష్ట్రం, కఛ్ జిల్లా, భుజ్ తాలూకాలో మధాపర్ గ్రామం మొత్తం ఆసియాలోనే అత్యంత సంపన్న గ్రామంగా ప్రసిద్ధి చెందింది. ఈ గ్రామ వాసుల డిపాజిట్లు మొత్తం రూ.7 వేల కోట్లకు పైమాటే. గణాంకాల ప్రకారం.. మధాపర్ జనాభా 2,011లో 17,000 నుంచి?దాదాపు 32,000గా ఉంది. ఈ ఊరిలోనే హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, పీఎన్‌బీ, యాక్సిస్ బ్యాంకు, ఐసీఐసీఐ, యూనియన్ బ్యాంకు బ్రాంచిలతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు మొత్తం 17 వరకు ఉన్నాయి. అయినా ఇతర బ్యాంకులు సైతం ఈ ఊరిలో తమ బ్రాంచీలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.మధాపర్ సంపన్న గ్రామంగా అవతరించడానికి ఎన్ఆర్ఎల్ కారణమని తెలుస్తోంది. విదేశాల్లో నివసిస్తున్న ఆ ఊరి ప్రజలు గ్రామంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న బ్యాంకుల్లో ఏటా కోట్ల మొత్తంలో డబ్బులు డిపాజిట్లు చేస్తుంటారు. విదేశాల్లో ఎక్కువగా ఆఫ్రికన్ దేశాల్లో నివసిస్తున్నారు. సెంట్రల్ ఆఫ్రికాలోని నిర్మాణ వ్యాపార రంగాల్లో గుజరాతీలు ఆధిపత్యం చెలాయిస్తున్నారు.

ఈ ఊరిలో మిగిలిన వారు యూకే, ఆస్ట్రేలియా, అమెరికా, న్యూజిలాండ్‌లో నివసిస్తున్నారు. చాలా మంది గ్రామస్తులు విదేశాలలో నివసిస్తున్నారు. పని చేస్తున్నప్పటికీ, వారు తమ గ్రామ అభివృద్ధికి అండగా నిలుస్తున్నారు. వారు నివసించే ప్రదేశంలో కాకుండా మధాపర్ గ్రామంలో ఉన్న బ్యాంకుల్లో డబ్బును డిపాజిట్ చేసేందుకు ఇష్టపడతారని జిల్లా పంచాయతీ మాజీ అధ్యక్షుడు పరుల్బెన్ కారా తెలిపారు.మధాపర్ గ్రామంలోని జాతీయ బ్యాంకు స్థానిక బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ భారీగా డిపాజిట్లు రావడంతో అభివృద్ధి చెందుతుందన్నారు. నీరు, పారిశుధ్యం, రహదారి వంటి అన్ని ప్రాథమిక సౌకర్యాలు ఉన్నాయి. బంగ్లాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, సరస్సులు, దేవాలయాలు ఉన్నాయని మేనేజర్ చెప్పారు.

# బుల్డోజర్ దండయాత్ర...

హైదరాబాద్: అక్రమ నిర్మాణాల కూల్చివేతతో టాపిక్ ఆఫ్ ది న్యూస్‌గా మారింది హైడ్రా. 15 రోజులుగా బుల్డోజర్లతో దండయాత్ర చేస్తోంది. ఒక్కోరోజు ఒక్కో ప్లేస్‌లో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. ఉన్నట్లుండి సిటీలో కూల్చివేతలు బంద్ చేసి.. ఓఆర్ఆర్ అవతల డిమాలిష్ మొదలుపెట్టింది హైడ్రా. ఇదే ఇప్పుడు అందరిలో అనుమా నాలకు కారణం అవుతోంది. దగ్గరలో ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్ ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ కట్టడాల కూల్చివేత మొదలు పెట్టింది హైడ్రా. దీంతో అసలు కథే వేరే ఉందంటూ అనుమా నాలు మొదల య్యాయి. రాజకీయ కక్ష సాధింపు కోసమే హైడ్రాను ఏర్పాటు చేశారని.. నెక్ట్స్ కేటీఆర్ స్నేహితుడి జన్వాడ ఫాంహౌస్.. ఆ తర్వాత 111 జీవో పరిధిలోకీ హైడ్రా అడుగు పెట్టబోతుందంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది.ఇప్పటివరకు ప్రముఖుల కట్టడాలు, గెస్ట్ హౌస్‌ల జోళికి వెళ్లలేదు హైడ్రా. దీనికి ప్రధాన కారణం ఆ ఫాంహౌస్‌లు హైడ్రా పరిధిలో లేకపోవడమే అనే టాక్ విన్పిస్తోంది. దీంతో త్వరలో 111 జీవో పరిధిలోని ప్రాంతాలను కూడా హైడ్రా కిందకు తీసుకొచ్చి అసలు టార్గెట్ ను అప్పగిస్తారనే ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే నిబంధనలకు విరుద్ధంగా కట్టిన ప్రముఖుల గెస్ట్‌హౌస్ లపై చర్యలుంటాయా.? చెరువుల ఎఫ్టీఎల్, బఫర్‌జోన్లు, పార్కుల్లో నిర్మాణా లను నేలమట్టం చేస్తున్న హైడ్రా ? బడాబాబుల ఫాంహౌస్‌ల పని పడుతుందా..? అన్నది చర్చనీయాంశంగా మారింది. హైడ్రా విధివిధా నాల ప్రకారం గెస్ట్ హౌస్‌లపై చర్యలకు అవకాశం లేదని తెలుస్తోంది. అందుకే హైడ్రా అధికారాలు, పరిధి పెంచేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఉన్నతస్థాయి అధికారులతో చర్చిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. 111 జీవో పరిధిలో ప్రాంతాలను హైడ్రా కిందకు తేవడం వెనక భారీ వ్యూహమే ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. 111జీవో పరిధిలోని ఏరియాలో చాలామంది బీఆర్ఎస్ నేతలకు వందల ఎకరాలు భూములు, ఫాంహౌస్‌లు ఉన్నట్లు ఎప్పటినుండో కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అందుకే ఃఖీూ హయాంలో 111 జీవో ఎత్తేసే ప్రయత్నం జరిగిందన్నది కాంగ్రెస్ వాదనగా ఉంది. ఇప్పుడు ఒకవేళ 111 జీవో పరిధిలోకి హైడ్రా వెళ్తే ఏయే బీఆర్ఎస్ నేతలు టార్గెట్ కానున్నారన్నది ఆసక్తికరంగా మారింది. అయితే బీఆర్ఎస్ కూడా అలర్ట్ అయింది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో కట్టిన నిర్మాణాలు..111 జీవో పరిధిలో ఉన్న కాంగ్రెస్ నేతల ఫాంహౌస్ లు, ఆక్రమిత భూముల వివరాలు సేకరించే పనిలో పడింది. ఇప్పటికే బీఆర్ఎస్ నేతలు చాలామంది ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న కాంగ్రెస్ ముఖ్యులు, మంత్రులు, ఎమ్మెల్యేలకు సంబంధించిన భవనాలు, ఫాంహౌస్ నిర్మాణాలను ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తూ ఎప్పుడు వీటిని కూల్చివేస్తారంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. అన్ని అక్రమ కట్టడాలపై చర్యలు ఉంటాయా.. లేక మీకు టార్గెట్ ఉన్న నేతల ఆస్తులనే ధ్వంసం చేస్తారా అని క్వశ్చన్ చేస్తున్నారు. మంత్రి కేటీఆర్ కూడా ఇప్పటికే బఫర్ జోన్లలో కాంగ్రెస్ కీలక నేతలకు ఎవరెవరికి నిర్మాణాలున్నాయో బహిరంగంగానే ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ సర్కార్‌పై ఒత్తిడి పెరుగుతోంది.ఇప్పుడు రేవంత్ సర్కార్ హైడ్రా పరిధిలోకి 111 జీవో ప్రాంతాలను తీసుకొస్తుందా.. ఒకవేళ తీసుకొస్తే కాంగ్రెస్ నేతల గెస్ట్ హౌస్‌లపై చర్యలు తీసుకుంటారా అనేది ఆసక్తికరంగా మారింది. ఆరోపణలు, విమర్శలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హైడ్రా సెంట్రిక్‌గా డైలాగ్ వార్ నడుస్తోంది. వీటిని పట్టించుకోకుండా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాత్రం తన యాక్షన్ తాను చేసుకుంటూ బుల్డోజర్లతో ముందుకు సాగుతూనే ఉన్నారు.

# మెంబర్ షిప్ డ్రైవ్ లో బీజేపీ

హైదరాబాద్: కేంద్రంలో మూడోసారి అధికారం దక్కించుకున్నాక, సంస్థాగత ఎన్నికలపై కమలనాథులు ఫోకస్ చేశారు. మెంబర్ షిప్ డ్రైవ్‌తో దేశవ్యాప్తంగా ఆ ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నారు. దాదాపు మూడు నెలల పాటు సాగే సుదీర్ఘ ప్రక్రియతో బూత్ కమిటీ అధ్యక్షుడి నుంచి జాతీయ అధ్యక్షుడి వరకు పార్టీలో ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణలో ఈ ప్రక్రియతో కొత్త అధ్యక్షుడి ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది.కమలం పార్టీలో సంస్థాగత సంగ్రామానికి సర్వం సిద్ధమైంది. దేశవ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమంతో దీన్ని ప్రారంభించబోతున్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు అభియాన్ పై డిల్లీలో వర్క్ షాప్ తర్వాత సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్ లో రాష్ట్రస్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. సభ్యత్వ నమోదు పై పార్టీ శ్రేణులకు నేతలు దిశానిర్దేశం చేశారు. సభ్యత్వ నమోదు విధివిధానాలు పార్టీ నాయకత్వం ప్రకటించింది. సభ్యత్వ నమోదు కు సంబంధించి తెలంగాణలో 12 మందితో ఓ కమిటీనీ కూడా నియమించారు. ఇందులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులతోపాటు పార్టీ ముఖ్య నేతలు ఉన్నారు. తెలంగాణలో మెంబర్ షిప్ డ్రైవ్ ను పెద్ద ఎత్తున నిర్వహించడంతో పాటు లోకల్ వార్ కు సైరన్ మోగించారు సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్ లో జరిగిన సభ్యత్వ నమోదు వర్క్ షాప్ లో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్, కేంద్ర పార్టీ నుంచి విజయ రహత్కర్, అభయ్ పాటిల్ పాల్గొనగా.. ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్, బిజేఎల్పీ నేత మహేశ్వరరెడ్డి సహా పలువురు నేతలు హాజరయ్యారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా గుర్తింపు ఉన్న బీజేపీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల సమరానికి సిద్ధమయ్యేలా ప్రణాళికలు వేస్కోని.. సభ్యత్వ నమోదులో మహిళలు. యువత, రైతులపై ఎక్కువ ఫోకస్ పెట్టాలని సూచించారు కిషన్ రెడ్డి. మెంబర్ షిప్ డ్రైవ్ ఫస్ట్ పేజ్ సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 1 నుండి సెప్టెంబర్ 25 వరకు మొదటి విడత, అక్టోబర్ 1 నుంచి అక్టోబర్ 15 వరకువ రెండో విడత సభ్యత్వ నమోదు నిర్వహించనున్నారు. అంతకుముందు ఆగస్ట్ , 24, 25 తేదీల్లో జిల్లా స్థాయి వర్క్ష షాప్స్, ఆగస్ట్ 26 నుంచి 30 మండల స్థాయి వర్క్ షాప్స్, ఆగస్ట్ 30 రాష్ట్ర స్థాయి మోర్చాలా వర్క్ షాప్స్, ఆగస్ట్ 31 పోలింగ్ బూత్ స్థాయి వర్క్ షాప్స్ నిర్వహిస్తారు. ఈ సారి తెలంగాణలో దాదాపు 50 లక్షల సభ్యత్వం టార్గెట్ గా బీజేపీ ముందుకు వెళ్తోంది.మెంబర్ షిప్ డ్రైవ్ తర్వాత సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. కింది స్థాయి నుంచి పార్టీ అంతర్గత ఎన్నికలు జరగనున్నాయి. బూత్ కమిటి అధ్యక్షుల ఎన్నిక మొదట జరుగుతుంది. తర్వాత మండల కమిటీ, జిల్లా కమిటీ అధ్యక్షుల ఎన్నిక వరస క్రమంలో నిర్వహిస్తారు. ఆపై రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక డిసెంబర్ లో జరిగే ఛాన్స్ కనిపిస్తోంది. దేశంలో సగానికి పైగా రాష్ట్రాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుని ఎన్నిక పూర్తయితే జాతీయ అధ్యక్ష ఎన్నిక జరుగుతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల ఉన్న రాష్ట్రాలకు నేరుగానే అధ్యక్షుల ఎంపిక చేస్తున్నా, కమల అధినాయకత్వం? మిగిలిన రాష్ట్రాలకు తొందర పడకుండా ఎన్నిక ప్రక్రియద్వారానే అధ్యక్షుల ఎంపిక పూర్తి చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.లోక్ సభ ఎన్నికల తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి కిషన్ రెడ్డి రెండోసారి కేంద్రమంత్రి కావడంతో ఆయన ప్లేస్ లో కొత్త అధ్యక్షుడు వస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది. పలువురి పేర్లు కూడా రేసులో ముందున్నాయి. మరికొంత మంది పేర్లు కన్ఫర్మ్ అయ్యాయని వార్తలు చక్కర్లు కొట్టాయి. అవే పేర్లతో సంస్థాగత ఎన్నికల్లోనే కొత్త అధ్యక్షుని ఎన్నిక ఉంటుందని పార్టీనేతలు అంటున్నారు. ప్రస్తుతం మెంబర్ షిప్ డ్రైవ్ తో బిజీ షెడ్యూల్ లోకి బీజేపీ వెళ్లబోతుందన్న మాట..!

# అతడు 'కోహినూర్ వజ్రం'.. జాగ్రత్తగా కాపాడుకోవాలి..!



ప్రపంచంలోని మేటి బౌలర్‌గా ఎదిగిన భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌ను దిగ్గజాలు కొనియాడడం విన్నాం. ఈతరంలో గొప్ప బౌలర్ అంటూ పలువురు లెజెండరీ క్రికెటర్లు కితాబులివ్వడం చూశాం.

యార్కర్ కింగ్‌గా పేరొందిన బుమ్రాపై మాజీ ఆటగాడు దినేశ్ కార్తిక్ తాజాగా ప్రశంసలు కురిపించాడు.

బుమ్రా ముఖ్యమైన మ్యాచ్‌లే ఆడడం గురించి స్పందించిన కార్తిక్.. 'బుమ్రా కోహినూర్ వజ్రం లాంటివాడు. అందుకని అతడిని మనం చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలి' అని అన్నాడు. 'బుమ్రా లాంటి ఫాస్ట్ బౌలర్ ఫిట్‌నెస్‌ను నిత్యం పర్యవేక్షించడం చాలా అవసరం. అంతేకాదు బుమ్రాపై పని ఒత్తిడి పడకుండా చూడాలి. అందుకని అతడిని ముఖ్యమైన మ్యాచ్‌లే ఆడించాలి. తద్వారా అతడిని సుదీర్ఘ కాలం క్రికెట్ ఆడేలా చూడాలి. ఎందుకంటే.. ఈ స్పీడ్‌స్టర్ ఏ ఫార్మాట్‌లో ఆడినా సరే.. దానిపై తన ముద్ర వేస్తాడు' అని కార్తిక్ తెలిపాడు.ఈ మధ్యే ముగిసిన టీ20 వరల్డ్ కప్‌లో బుమ్రా బౌలింగ్‌ను ఎంత పొగిడినా తక్కువే. లీగ్ దశలో.. ఫైనల్లో సంచలన ప్రదర్శన కనబరిచిన యార్కర్ కింగ్ టీమిండియా ట్రోఫీ కలను నిజం చేశాడు.

ఫార్మాట్ ఏదైనా సరే

వన్డే, టీ20, టెస్టు.. ఫార్మాట్ ఏదైనా సరే నిప్పులు చెరిగే 30 ఏండ్ల బుమ్రాను ఎదుర్కోవడం బ్యాటర్లకు శక్తికిమించిన పనే. ఇప్పటివరకూ 36టెస్టులే ఆడాడు. కానీ, తన సంచనల బౌలింగ్‌తో ప్రత్యర్థులను వణికిస్తూ 159 వికెట్లు పడగొట్టాడు.

పొట్టి ప్రపంచ కప్ తర్వాత కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు సీనియర్లు విరాట్ కోహ్లీ, బుమ్రాలకు సెలెక్టర్లు విశ్రాంతినిచ్చిన విషయం తెలిసిందే. అనంతరం శ్రీలంక పర్యటనలో కోహ్లీ, రోహిత్‌లు వన్డే సిరీస్ ఆడినా బుమ్రాను మాత్రం పక్కనపెట్టేశారు. ఇక దేశవాళీ లీగ్ బుచ్చిబాబు టోర్నమెంట్‌లోనూ ఈ స్పీడ్‌గన్‌ను ఆడించడం లేదు. స్వదేశంలో బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్, అనంతరం ఆస్ట్రేలియా పర్యటన, ఇంగ్లండ్ టూర్ నేపథ్యంలో సెలెక్టర్లు బుమ్రాకు విశ్రాంతి ఇవ్వాలని భావిస్తున్నారు.

# షకీబ్ అల్ హసన్‌పై మర్డర్ కేసు నమోదు



ఢాకా: బంగ్లాదేశ్ క్రికెటర్ షకీబ్ అల్ హసన్‌పై మర్డర్ కేసు నమోదు అయ్యింది. రఫీకుల్ ఇస్లామ్ ఈ కేసు దాఖలు చేశారు. ఆగస్టు 7వ తేదీన జరిగిన ర్యాలీలో రఫీకుల్ కుమారుడు రూబెల్ మరణించాడు. అడోబార్ రింగు రోడ్డులో జరిగిన ర్యాలీ సమయంలో కాల్పుల్లో రూబెల్ మృతిచెందాడు. అయితే ఈ ఘటనకు చెందిన అడోబార్ పోలీసు స్టేషన్ కేసు నమోదు చేశారు. ఆ కేసులో 28వ నిందితుడిగా షకీబ్ పేరును చేర్చారు. బంగ్లా పాపులర్ నటుడు ఫెర్దౌస్ అహ్మద్‌ను 55వ నిందితుడిగా చేర్చారు. ఈ ఇద్దరూ అవామీ లీగ్ పార్టీకి చెందిన మాజీ ఎంపీలు. రూబెల్ మృతి కేసులో మొత్తం 154 మంది నిందితుల్ని చేర్చారు. దాంట్లో ప్రధాని షేక్ హసీనా కూడా ఉన్నారు. ఈ కేసులో మరో 500 మంది గుర్తు తెలియని వ్యక్తుల్ని నిందితులుగా చేర్చారు. మరో వైపు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడిగా ఫారూక్ అహ్మద్ పేరును ప్రకటించారు. ఆ పోస్టుకు నజ్ముల్ హసన్ రాజీనామా చేశారు. హసీనా ప్రభుత్వంలో క్రీడామంత్రిగా కూడా నజ్ముల్ చేశారు. హసీనాకు వ్యతిరేకంగా సాగిన నెల రోజుల నిరసన ప్రదర్శనల్లో .. సుమారు 450 మంది మరణించారు.

# గొడవ పెద్దది కావడంతో చున్నీతో బిగించిన భార్య

హైదరాబాద్: మద్యం మహమ్మారి అనేక కుటుంబాల్లో చిచ్చుకు కారణమవుతోంది. మద్యం మత్తులో మగవాళ్లు చేసే అరాచకాలకు ఎంతో మంది మహిళలు బలి అవుతున్నారు. కొన్నిసార్లు ఈ వేధింపులు తట్టుకోలేక మహిళలు కూడా తాగుబోతు భర్తలను హతమార్చేస్తున్నారు. తాజాగా ఇటువంటి ఘటనే హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. నిత్యం మద్యం తాగి వచ్చి వేధిస్తున్న భర్త ఆగడాలను భరించలేకపోయిన ఇల్లాలు అతని మెడకు చున్నీని బిగించి కంపేసింది. ఈ ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ మీడియాకు వెల్లడించారు. అసోం రాష్ట్రానికి చెందిన అలీ హుస్సేన్ లస్కర్ (35), రుస్తానా బేగం లస్కర్ దంపతులు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబాన్ని పోషించుకునేందుకు రెండేళ్ల కిందట వీరు హైదరాబాద్ నగరానికి వచ్చారు. అప్పటి నుంచి మియాపూర్ హఫీజ్‌పేటలోని ప్రేమ్‌నగర్ కాలనీలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే అలీ హుస్సేన్ లస్కర్ మద్యానికి అలవాటు పడ్డాడు. క్రమంగా ఈ అలవాటు బానిసత్వానికి దారి తీసింది. నిత్యం మద్యం తాగి వచ్చి గొడవ చేయడంతోపాటు భార్యను వేధింపులకు గురి చేసేవాడు. పిల్లలను కూడా కొడుతుండడంతో తీవ్రంగా ఇబ్బందులు పడేది. సోమవారం రాత్రి కూడా అలీ హుస్సేన్ పూటుగా తాగి వచ్చాడు. ఎప్పటి మాదిరిగానే ఇంట్లో గొడవ చేయడంతో పాటు భార్యను, పిల్లలను కొట్టాడు. మద్యం మత్తులో ఉన్న హుస్సేన్ భార్యను, పిల్లలను తీవ్రంగా కొడుతుండడంతో భార్య రుస్తానా బేగం ఎదురు తిరిగింది. ఈ క్రమంలోనే ఇద్దరి మధ్య గొడవ చోటు చేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున కూడా మరోసారి గొడవకు దిగడంతో సహనం కోల్పోయిన రుస్తానా తన చున్నీతో భర్త అలీ హుస్సేన్ లస్కర్ మెడకు భిగించింది. గట్టిగా చున్నీని బిగించడంతో హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో ఒక్కసారిగా షాక్ గురైన బేగం అక్కడి నుంచి పారిపోయింది. మృతుడి సోదరుడు అక్బర్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ హత్యను భార్య రుస్తానా బేగం చేసినట్టు నిర్ధారణకు వచ్చిన పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో హత్య చేసిన విషయాన్ని బేగం అంగీకరించారు. భర్త వేధింపులను భరించలేక చున్నీని తానే మెడకు బిగించి హత్య చేసినట్టు వెల్లడించింది. నిందితురాలిని రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు వెల్లడించారు. మద్యం మహమ్మారి ఒక ప్రాణాన్ని బలిగొనగా, మరొకరిని జైలు పాలు చేసింది. దీంతో ముగ్గురు చిన్నారులు ఇప్పుడు అనాథలుగా మిగిలారు. ఈ తరహా ఘటనలు అనేకం చోటుచేసుకుంటుండడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

# రేస్ వాకర్ భావ్నా జాట్‌పై 16 నెలల బ్యాన్



న్యూఢిల్లీ: భారత అథ్లెట్, రేస్ వాకర్ భావ్నా జాట్(%దీప్ఘుఃఘఝు జీఫ్%)పై.. 16 నెలల బ్యాన్ విధించారు. యాంటీ డోపింగ్ కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నది. గత ఏడాది ఆగస్టులో ఆమె నేరానికి పాల్పడినట్లు తెలుస్తోంది. మహిళల 20 కిలోమీటర్ల రేస్‌వాక్‌లో భావ్నా.. మాజీ జాతీయ చాంపియన్. రికార్డు హోల్డర్ కూడా. గత ఏడాది నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ ఆమెపై సస్పెన్షన్ విధించింది.

వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మధ్యలోనే బుదాపెస్ట్ నుంచి ఆమెను వెనక్కి రప్పించారు. గత ఏడాది ఆగస్టు 10వ తేదీ నుంచి 16 నెలల బ్యాన్ అమలులోకి వస్తుంది. ఈ ఏడాది డిసెంబర్ 10వ తేదీన ఆమెపై విధించిన నిషేధం ముగుస్తుంది. నాడా రూల్స్‌లోని ఆర్టికల్ 2.4 ప్రకారం వాకర్ భావ్నా జాట్‌పై నిషేధం విధించారు. జూలై 10వ తేదీన ఆ తీర్పును ఇచ్చారు.

కానీ ఆ వార్తలను యాంటీ డోపింగ్ ఏజెన్సీ గురువారమే తన వెబ్‌సైట్‌లో ప్రచురించింది. ఆర్టికల్ 2.4 ప్రకారం.. ఓ అథ్లెట్ వరుసగా మూడు సార్లు డోపింగ్ పరీక్షలో విఫలం అయితే, ఆ క్రీడాకారులపై నిషేధం విధిస్తారు. 2023లో మే, జూన్ నెలలో జరిగిన డోపింగ్ పరీక్షల్లో భావ్నా పాజిటివ్‌గా తేలింది. నిర్దేశిత సమయంలో ఫైలింగ్ కూడా చేయలేదని ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో భావ్నా జాట్ ప్రాతినిధ్యం వహించింది. గతేడాది జరిగిన జాతీయ అంతర్ రాష్ట్ర పోటీల్లో ఆమె స్వర్ణం గెలుచుకున్నది.

# తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ ధర్నాలు

హైదరాబాద్: తెలంగాణ రైతు రుణమాఫీపై రాజకీయ రగడ జరుగుతోంది. ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15లోగా 2 లక్షల రూపాయల వరకు ఉన్న పంట రుణాలను మాఫీ చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తోంది. అయితే... సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా రుణమాఫీ చేశామని చెప్తుంటే... మంత్రులు మాత్రం రుణమాఫీ ఇంకా పూర్తిగా చేయలేదని అంటున్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల మధ్యే సమన్వయం లేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. అర్హులైన రైతులందరికీ... రూ. 2లక్షల రుపాయల వరకు పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ.. ధర్నాలు దిగింది బీఆర్ఎస్ (ఃఖీూ). హరీష్‌రావు పాపపరిహార ప్రమాణం.. యాదగిరిగుట్ట ఆలయానికి వెళ్లారు మాజీ మంత్రి హరీష్‌రావు. లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాపపరిహార ప్రమాణం కూడా చేశారు హరీష్‌రావు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారని అన్నారు. దేవుడి మీద ఒట్టు వేసి రేవంత్‌రెడ్డి మాట తప్పారన్నారు. ఆయన చేసిన తప్పునకు ప్రజలను శిక్షించవద్దు అంటూ.. యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామిని వేడుకున్నారు హరీష్‌రావు. సీఎం రేవంత్‌రెడ్డికి బుద్ధివచ్చేలా చేయాలని వేడుకున్నానని అన్నారు.అర్హత ఉన్న రైతులు అందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ. 2 లక్షల రూపాయల వరకు ఉన్న పంట రుణాలు మాఫీ చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. 119 నియోజకవర్గాల్లో ధర్నాలు చేపడుతోంది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలు, కాంగ్రెస్ మంత్రుల నియోజకవర్గాల్లో.. పార్టీ కేడర్ భారీగా తరలివచ్చి.. కార్యక్రమాన్ని విజయవంత చేయాలని పిలుపునిచ్చింది. చేవెళ్లలో కేటీఆర్, ఆలేరులో హరీష్‌రావు ధర్నా కార్యక్రమంలో పాల్గొంటారు. ఆగస్టు 15 లోగా రైతులందరికీ రుణ మాఫీ చేస్తా అని రేవంత్ రెడ్డి యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి మీద ఒట్టేసి రైతులను దగా చేశారని.. తెలంగాణ ప్రజలకు ఎలాంటి కీడు జరగొద్దని కోరుతూ.. యాదాద్రిలో పాప పరిహార పూజలు నిర్వహించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావుఎన్నికల తర్వాత... రైతు రుణమాఫీపై అంచనాలు సిద్ధం చేసిన కాంగ్రెస్ పార్టీ.. 40వేల కోట్లు అవసరమవుతుందని చెప్పింది. ఆ తర్వాత జరిగిన మంత్రివర్గ సమావేశంలో 31 వేల కోట్లకు అనుమతి ఇచ్చింది. అయితే.. బడ్జెట్‌లో మాత్రం 26వేల కోట్లు మాత్రమే కేటాయించింది. చివరికి వచ్చే సరికి... 18వేల కోట్ల రైతు రుణాలు మాత్రమే మాఫీ చేసిందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. రాష్ట్రంలోని 40శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదని చెప్తున్నారు బీఆర్ఎస్ నేతలు. రైతుల తరపున తాము పొరాడుతున్నామని చెప్తున్నారు.

# అత్యుత్తమ ఆటగాళ్లుగా రోహిత్, కోహ్లి

**- ద్రావిడ్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు**

**- సియేట్ క్రికెట్ అవార్డుల ప్రదానోత్సవం**

ముంబయి: టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, మహ్మద్ షమీలకు అవార్డులు వరించాయి. 26వ సియేట్ క్రికెట్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ముంబయిలో బుధవారం అట్టహాసంగా జరిగింది. 2023 ఏడాదికి టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మకు ఇంటర్నేషనల్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు వరించగా.. కోచ్ రాహుల్ ద్రావిడ్‌కు 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డు, విరాట్ కోహ్లికి ఉత్తమ వన్డే బ్యాటర్ ఆఫ్ ది ఇయర్, పేసర్ మహ్మద్ షమీకి 2023 ఏడాదికి ఉత్తమ వన్డే బౌలర్‌గా అవార్డులు దక్కాయి. 2023లో రోహిత్ శర్మ 1,800 అంతర్జాతీయ పరుగులు కొట్టాడు. అందులో వన్డేల్లో 52.59 సగటుతో 1,255పరుగులు చేయగా.. ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో 597 పరుగులు కొట్టిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రోహిత్ శర్మ మాట్లాడుతూ.. భారతజట్టు టి20 ప్రపంచకప్ గెలుచుకోవడంలో ఆ ముగ్గురి పాత్ర కీలకమని పేర్కొన్నాడు. కోచ్ రాహుల్ ద్రవిడ్, సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్‌తోపాటు బోర్డు కార్యదర్శి జై షా ముగ్గురు మూడు పిల్లర్ల వల్లే సాధ్యమైందని పేర్కొన్నాడు. ఈ ముగ్గురి వల్లనే ఐసిసి ట్రోఫీ కల సాకారమైందన్నాడు. టోర్నమెంట్ మొత్తం ఫలితాల గురించి పెద్దగా ఆలోచించలేదని, ఎవరి పాత్ర వారు సమర్ధవంతంగా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకున్నామన్నారు. ఇందుకు జై షా, ద్రవిడ్, అగార్కర్ నుంచి తనకు పూర్తి సహకారం లభించిందన్నాడు. దీనికి తోడు ప్లేయర్లందరూ సమిష్టిగా రాణించడం కలిసివచ్చింది. దీంతో దశాబ్ద కాలంగా అందని ద్రాక్షలా ఉన్న ఐసిసి ట్రోఫీని చేజిక్కించుకోవడం జరిగిందని గుర్తుచేసుకున్నాడు. అలాగే ప్రపంచకప్ గెలిచిన తర్వాత ప్రతీ సందర్భాన్ని ఆస్వాదించాలనుకున్నాం. అందుకు తగ్గట్లు దేశం మొత్తం సంబరాల్లో భాగం కావడం జీవితంలో మరిచిపోలేనిది. అది మాటల్లో వర్ణించలేమన్నాడు. రానున్న రోజుల్లో కీలకమైన సిరీస్‌ల్లో ఆడాల్సి ఉంది' అని అన్నాడు.

వన్డే బ్యాటర్ ఆఫ్ ది ఇయర్‌గా విరాట్..

'వన్డే బ్యాటర్ ఆఫ్ ది ఇయర్' టీమిండియా రన్ మెషిన్ విరాట్ కోహ్లికి లభించింది. 2023లో విరాట్ కోహ్లి అద్భుత ఫామ్‌తో బ్యాట్‌నుంచి పరుగుల వరద పారింది. ఈ క్రమంలో ఆ ఏడాది ఆరు సెంచరీలతో సహా 1,377పరుగులు చేసాడు. 2023 ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో కోహ్లి ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. ఈ టోర్నమెంట్‌లో భాగంగా 11 మ్యాచుల్లో 95.62సగటుతో 765పరుగులు చేసి అత్యధిక పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో అత్యధిక సెంచరీలు కొట్టిన సచిన్ టెండూల్కర్(6సెంచరీ) రికార్డును సమం చేశాడు.



# హరీష్ రావు టెంపుల్ రన్

నల్గొండ: రైతు రుణమాఫీపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి దేవుళ్ల మీద ఒట్టేసి అన్నదాతల్ని దగా చేశారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ముఖ్యమంత్రి చేసిన పాపానికి తెలంగాణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూసేలా ఆలయాలకు వెళ్లి దేవుళ్లకు పూజలు చేస్తానని ఇటీవల హరీష్ రావు ప్రకటించారు. ఇందులో భాగంగా హరీష్ రావు ఆలయాల యాత్రకు శ్రీకారం చుట్టనున్నారని తెలుస్తోంది. యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని హరీష్ రావు ఆలయాల యాత్ర మొదలు పెట్టారు. యాదాద్రి లక్ష్మీ నర్సింహస్వామి మీద ఒట్టు పెట్టినా, ఆగస్టు15 లోగా రైతులందరికి రుణమాఫీ చేయలేక పోయారు సీఎం రేవంత్ రెడ్డి. దేవుడి మీద ఒట్టు పెట్టినా రైతులకు రుణమాఫీపై మాట తప్పారు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి పాప పరిహారం కోసం, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలతో కలిసి గురువారం యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకొని పూజలు చేయబోతున్నాం. దేవుడా ఈ పాపాత్ముడైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని క్షమించు, తెలంగాణ ప్రజలపై దయ ఉంచు అని స్వామి వారిని వేడుకుంటాం. ముఖ్యమంత్రి చేసిన పాపం ప్రజలకు శాపం కాకుండా ప్రజలను రక్షించాలని నరసింహ స్వామిని ప్రార్థిస్తాం.రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మాటలు ఇలా ఉన్నాయి. గత డిసెంబర్ నెలలో 49వేల కోట్ల వ్యవసాయ రుణాలు ఉన్నాయని చెప్పారు. కొన్నిరోజులు కడుపు కట్టుకుంటే చాలు ఏడాదిలో 40వేల కోట్ల రుణమాఫీ చేస్తానని జనవరిలో చెప్పారు. తరువాత తెలంగాణ కేబినెట్ భేటీలో నిర్ణయించిన 31వేల కోట్లు రుణాలు మాఫీ చేస్తామని దేవుళ్ల మీద ఒట్లు పెట్టారు. ఇటీవల పూర్తి స్థాయి బడ్జెట్ కేటాయింపుల్లో ఆ మొత్తాన్ని రూ. 26 వేల కోట్లకు కుదించారు. రూ. 17 వేల కోట్లు రుణమాఫీ చేశామని ఆగస్టు 15 నాడు చెప్పారు. ఓవైపు రుణమాఫీ పూర్తయిందని సీఎం రేవంత్ రెడ్డి చెబుతుంటే, మరోవైపు రుణమాఫీ కాలేదని మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి చెబుతున్నారు. 17 లక్షల మందికి ఇంకా రుణమాఫీ కాలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటున్నారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**